ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
శనివారం 30 మార్చి 2024



నియోజకవర్గ ముఖచిత్రం

రాజకీయ కళావేదిక తెనాలి

రాజకీయ దిగ్గజాలకు నిలయం

తెనాలి నియోజకవర్గం నుంచి గెలుపోటములు పొందిన దిగ్గజాలుకూడా ఉన్నారు. ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు ఇక్కడ పోటీ చేశారు. నాదెండ్ల భాస్కరరావు 1989లో ఇక్కడి నుంచి గెలిచారు. 1994లో రెండోసారి పోటీచేసి ఓటమి పాలయ్యారు. 1999లో మరో మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు గవర్నర్‌గా చేసిన కొణిజేటి రోశయ్య తెనాలి నుంచి పోటీచేసి గోగినేని ఉమ చేతిలో ఓటమి చెందారు. తెనాలికి రాజకీయంగానే కాకుండా కళాపరంగానూ ఎందరో ప్రముఖులున్నారు. రాజకీయ రంగం తర్వాత తెనాలి కళలకు ప్రసిద్ధి. సినీ రంగంలో ఎందరో ప్రముఖులు నియోజకవర్గ కేంద్రం నుంచి ఉన్నారు. సీనియర్ నటుడు సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ, నటి ఊర్వశి శారద కూడా రాజకీయంగా గెలిచారు. శారద గతంలో తెనాలి పార్లమెంటు ఉన్న సమయంలో ఎంపీగా గెలిచారు. కృష్ణ,కొంగర జగ్గయ్యలు కూడా గతంలో గెలుపొందారు.


● ఆలపాటి వెంకటరామయ్య


● దొడ్డపనేని ఇందిర


● అన్నాబత్తుని సత్యన్నారాయణ


● నాదెండ్ల భాస్కరరావు



● నాదెండ్ల మనోహర్


● ఆలపాటి రాజా


● రావి రవీంద్రనాథ్


● అన్నాబత్తుని శివకుమార్


● గోగినేని ఉమ


● కొణిజేటి రోశయ్య

స్వాతంత్రోద్యమ కాలంలో ఉవ్వెత్తున ఎగసిపడిన ఉద్యమ జ్వాలలు నేటికీ ఈ పోరాటాల గడ్డపై రాజకీయ చైతన్యం రూపంలో ఇంకా ఎగసిపడుతూనే ఉన్నాయి... ఎందరో అమర వీరుల త్యాగాలకు ప్రతిరూపంగా నిలిచిన తెనాలి కేవలం ఉద్యమాలకే కాకుండా, కళలకు నిలయంగా, ఎందరో కళాకారులను అందించింది. నిత్యం పచ్చని పైరులతో పచ్చచీర కట్టుకున్నట్టు కనిపించే తెనాలికి పట్టణం మధ్య నుంచి వెళ్లే మూడు కాల్వలు ప్యారిస్ పేరునూ తెచ్చిపెట్టి, ఆంధ్రా ప్యారిస్‌గా ఖ్యాతి పొందింది. ఈ మూడు కాల్వలు ప్రవహించటం వల్లే అప్పట్లో హిందీలో 'తీన్ నాల్' అని పిలిచేవారని, తీన్ అంటే మూడు, నాల్ అంటే కాల్వలు అనే అర్థం కావటంతో ఈ పదం కాలక్రమంలో తెనాలిగా మారిందనేది కూడా ఒక నానుడి.

- స్వాతంత్రోద్యమాల నేల.. ఎందరో ఉద్దండులు ఏలిన నేల
- పోరాటాల పురిటిగడ్డపై ఎందరో ఉద్దండులు పోటీ
- వారసులకే ఇక్కడి ప్రజలు పట్టం
- తెనాలి రూటే సపరేటు.. ఇక్కడ ఎవరు గెలిస్తే ఆ పార్టీదే అధికారం
- 1985 నుంచి ఇదే ఆనవాయితీ
- రెండే మండలాలు... భారీగానే ఓటర్లు
- పార్లమెంట్ పోయి అసెంబ్లీ మిగిలె...

ఉద్దండుల జయాపజయాలు...

తెనాలి ఎందరో ఉద్దండులకు రాజకీయ వేదికగా నిలిచింది. కొణిజేటి రోశయ్య న్యాయవాద వృత్తి చేపట్టి తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆర్థికవేత్తగా మంచిపేరున్న ఆయన కాంగ్రెస్ మంత్రివర్గాలలో అనేకమంది ముఖ్యమంత్రుల కొలువులో ఆర్థిక మంత్రిగా పదవులను అలంకరించారు. తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా చేశారు. ఆ తర్వాత తమిళనాడు గవర్నర్‌గా పనిచేశారు. అయితే ఈయన ఎక్కువగా వేమూరు నుంచి పోటీలో నిలిస్తే, తెనాలిలో పోటీచేసిన ఒక్కసారి ఓటమి పాలయ్యారు. 1999లో పోటీచేసి గోగినేని ఉమ చేతిలో ఓటమి చెందారు. నాదెండ్ల భాస్కరరావు ఎన్టీఆర్ అనుచరునిగా, ఆ తర్వాత ఆయన ప్రభుత్వం కూల్చివేత అనంతరం ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే ఆయన అతి తక్కువ కాలమే ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన కుమారుడు నాదెండ్ల మనోహర్ రాష్ట్ర విభజన సమయంలో స్పీకర్‌గా, నేడు జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. ప్రస్తుతం తెనాలి స్థానం నుంచి ఉమ్మడి అభ్యర్థిగా పోటీలో ఉన్నారు.

తెనాలి పార్లమెంట్‌లోనూ ఎందరో ప్రముఖులు

1952లో ఏర్పడిన తెనాలి పార్లమెంటు స్థానంలో ఎందరో ప్రముఖులు పోటీచేసి విజయాలు సాధించారు. అయితే 2004 ఎన్నికల తర్వాత ఈ పార్లమెంట్ స్థానం లేకుండాపోయింది. అప్పటి వరకు జరిగిన 14 ఎన్నికల్లో తొలి ఎంపీగా కొత్త రఘురామయ్య ఎన్నికయితే, తర్వాత ఎన్జీ రంగా, కమ్యూనిస్టు ప్రముఖులు కొల్లా వెంకయ్య, లావు బాలగంగాధర రావు ఇక్కడి నుంచి పోటీచేసి గెలిచారు. తర్వాత సినీనటి ఊర్వశి శారద, కేంద్రమంత్రులుగా చేసిన పి.శివశంకర్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కూడా ఇక్కడ గెలిచి ఢిల్లీ పీఠంపై పదవులను దక్కించుకున్నారు. అయితే 2004లో జరిగిన ఎన్నికలే చివరివి అయితే, 2009 నాటికి తెనాలి పార్లమెంటు రద్దయి, గుంటూరు పార్లమెంటులో తెనాలి అసెంబ్లీ నియోజక వర్గాన్ని కలిపేశారు. దీంతో అప్పటి నుంచి తెనాలి కేవలం అసెంబ్లీ ఎన్నికలకే పరిమితమైంది.

నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు

- కమ్మ : 31,000
- కాపు : 40,000
- వైశ్య : 21,000
- మాల : 30,000
- మాదిగ : 26,000
- బ్రాహ్మణ : 6,000
- రెడ్డి : 12,000
- ముస్లిం : 25,000
- యాదవ : 20,000
- పద్మశాలి : 10,000
- రాజులు : 2,000
- రజక : 8,000
- విశ్వబ్రాహ్మణ : 5,000
- గౌడ : 9,000
- నాయీబ్రాహ్మణ: 4,000
- మేదర : 1,500
- కుమ్మర : 1,500
- కుంకుపు : 500
- ముదిరాజులు: 1000
- లంబాడీ : 5,000
- ఎరుకల : 2,500
- యానాది : 2,500
- మార్వాడీ : 1,900

ప్రస్తుత ఎన్నికల్లో..

ప్రస్తుత ఎన్నికలకు అంతా సమాయత్తమయితే, అధికార వైసీపీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మరోసారి పోటీలో ఉండగా, గత ఎన్నికల్లో వేరువేరుగా పోటీచేసిన తెలుగుదేశం, జనసేన ఇప్పుడు బీజేపీతో కలసి పోటీలో నిలవటం, వీరి ఉమ్మడి అభ్యర్థిగా జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ పోటీ పడుతుండటం ఇక్కడ ప్రత్యేకం. గత ఎన్నికల్లో విజయం సాధించిన వైసీపీ అభ్యర్థి శివకుమార్‌కు 94,495 ఓట్లు వస్తే, టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు 76,846 ఓట్లు దక్కాయి. అయితే ఇక్కడ త్రిముఖ పోటీలో నాదెండ్ల మనోహర్ అనూహ్యంగా 29,905 ఓట్లు పొందారు. దీంతో శివకుమార్‌కు విజయం దక్కింది. అయితే ఇప్పుడు ఇద్దరు కాకుండా మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా ఒక్కరే రంగంలోకి దిగటంతో చీలిన ఓట్లు ఆయనకు బలం చేకూర్చుతాయని, విజయాన్ని తెచ్చిపెడతాయనే ఆశాభావాన్ని ఆయా పార్టీలు వ్యక్తం చేస్తున్నాయి. అయితే పోటీ ఈసారి రసవత్తరంగా మారటం తెనాలి గడ్డపై ఉత్కంఠకు తెరలేపినట్టయింది.

తెనాలి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణం పురపాలక సంఘంగా 1909లోనే ఏర్పడింది. క్రమక్రమంగా అభివృద్ధి చెందుతూ ప్యారిస్ అందాలను కూడా సొంతం చేసుకుంది. ఎంతో చారిత్రక ప్రాధాన్యం కలిగిన తెనాలి నుంచి ఎందరో స్వాతంత్ర సమరయోధులు, సినీ, నాటక రంగ ప్రముఖులు, రాజకీయ ఉద్దండులు పుట్టుకొచ్చారు. తెనాలి అసెంబ్లీ నియోజకవర్గం 1952లో ఏర్పడితే, పార్లమెంటరీ నియోజకవర్గం కూడా 1952లోనే ఏర్పాటయింది. అయితే 2004లో చివరి పార్లమెంటు ఎన్నికలు జరిగితే, 2009 నుంచి తెనాలి పార్లమెంటు స్థానాన్ని తీసేసి, దానిని గుంటూరు పార్లమెంటులో కలిపేశారు. తెనాలి పార్లమెంటు కింద 14సార్లు ఎన్నికలు జరిగితే, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడ్డాక 15 సార్లు ఎన్నికలు జరిగాయి. 2024లో 16వ సారి ఎన్నికల జరగనున్నాయి. తెనాలి నియోజక వర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీ రాష్ట్రం లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే నానుడి ఉంది. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి ఇది నిజమవుతూనే వచ్చింది. ఇక్కడ గెలిచిన అభ్యర్థులు ఆయా మంత్రివర్గాల్లో అత్యున్నత పదవులు అలంకరించిన సందర్భాలూ ఉన్నా యి. అటువంటి వారిలో నాదెండ్ల భాస్కరరావు, అన్నాబత్తుని సత్యన్నారాయణ, నాదెండ్ల మనోహర్ వంటివారున్నారు. అయితే ఆలపాటి వెంకటరామయ్య కుటుంబానికి ఎక్కువ సార్లు ఎమ్మెల్యే అయ్యే అవకాశం కలిగింది.


తెనాలి మున్సిపల్ భవనం

వారసత్వానికి పట్టం...
ఏడుసార్లు ఏలిన ఒకే కుటుంబం

నియోజకవర్గం ఏర్పడ్డ తర్వాత ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరిగితే తొలి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆలపాటి వెంకట్రామయ్య కుటుంబం ఆరుసార్లు గద్దె నెక్కింది. ఆయన వరుసగా మూడు సార్లు గెలిస్తే, ఆయన కుమార్తె దొడ్డపనేని ఇందిర హ్యాట్రిక్ విజయాలను సాధించారు. ఒకసారి కాంగ్రెస్, మరోసారి స్వతంత్ర, మూడోసారి జనతాపార్టీ తరఫున ఆమె గెలిచారు. వీరి తర్వాత ఇందిర కుమార్తె డాక్టర్ గోగినేని ఉమ 1999లో గెలిచారు. ఇది ఒక రికార్డయితే ఇక్కడ వీరి బాటలోనే వా రసులకు అవకాశాలు దక్కాయి. టీడీపీ ఆవిర్భవించాక ఆ పార్టీ తరపున అన్నాబత్తుని సత్యన్నారాయణ 1983, 1985 ఎన్నికల్లో వరుసగా రెండు సార్లు గెలుపొందితే, ఆయన కుమారుడు శివకుమార్ గత 2019 ఎన్నికల్లో విజయం సాధించారు. మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు 1989లో ఇక్కడ పోటీచేసి గెలుపొందితే, ఆయన కుమారుడు నాదెండ్ల మనోహర్ 2004, 2009 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించారు. ఈయన అసెంబ్లీ స్పీకర్‌గా కూడా పని చేశారు.

నియోజకవర్గ ఓటర్లు 2,65,863

పురుషులు : 1,28,188

స్త్రీలు : 1,37,642

ఇతరులు: 33

సంవత్సరం	విజేత	పార్టీ	ఓటమి	పార్టీ	మెజార్టీ
1952	ఆలపాటి వెంకట్రామయ్య	కాంగ్రెస్	రావి అమ్మయ్య	సీపీఐ	8,077
1955	ఆలపాటి వెంకట్రామయ్య	కాంగ్రెస్	రావి అమ్మయ్య	సీపీఐ	8,295
1962	ఆలపాటి వెంకట్రామయ్య	కాంగ్రెస్	రావి అమ్మయ్య	సీపీఐ	6,198
1967	దొడ్డపనేని ఇందిర	కాంగ్రెస్	చింతమనేని సుబ్బారావు	స్వతంత్ర	32,335
1972	దొడ్డపనేని ఇందిర	స్వతంత్ర	నన్నపనేని వెంకట్రావు	కాంగ్రెస్	5753
1978	దొడ్డపనేని ఇందిర	జనతా	నన్నపనేని వెంకట్రావు	కాంగ్రెస్(ఐ)	2010
1983	అన్నాబత్తుని సత్యన్నారాయణ	స్వతంత్ర	దొడ్డపనేని ఇందిర	కాంగ్రెస్	29,224
1985	అన్నాబత్తుని సత్యన్నారాయణ	టీడీపీ	దొడ్డపనేని ఇందిర	కాంగ్రెస్	4589
1989	నాదెండ్ల భాస్కరరావు	కాంగ్రెస్	అన్నాబత్తుని సత్యన్నారాయణ	టీడీపీ	18,573
1994	రావి రవీంద్రనాథ్	టీడీపీ	నాదెండ్ల భాస్కరరావు	కాంగ్రెస్	13,531
1999	గోగినేని ఉమ	టీడీపీ	కొణిజేటి రోశయ్య	కాంగ్రెస్	5394
2004	నాదెండ్ల మనోహర్	కాంగ్రెస్	గోగినేని ఉమ	టీడీపీ	12,745
2009	నాదెండ్ల మనోహర్	కాంగ్రెస్	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	2884
2014	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	అన్నాబత్తుని శివకుమార్	వైసీపీ	19,065
2019	అన్నాబత్తుని శివకుమార్	వైసీపీ	ఆలపాటి రాజేంద్రప్రసాద్	టీడీపీ	17,649



సక్రమమైనవే.. లెక్కింపు

- పోస్టల్ బ్యాలెట్‌లలో ఈసారైనా ఓట్లు సక్రమంగా వేసేనా..!
- గత ఎన్నికల్లో 9,782 పీబీల తిరస్కారం
- ఫారం-13బీ కవర్‌పై సీరియల్ నెంబరు లేకపోవడమే కారణం
- నిబంధనలపై అవగాహన లేకుంటే పీబీ ఓటు వేసినా నిరుపయోగమే

గుంటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడంలో సంబంధిత ఓటర్లు ఎన్నికల సంఘం నిబంధనలను సక్రమంగా పాటించక పోతుండటం వలన వారి ఓట్లు నిరుపయోగంగా మారుతున్నాయి. గత 2019 ఎన్నికల్లో ఉద్యోగులు, ఎన్నికల రోజున విధుల్లో ఉండే ఇతరత్రా సిబ్బంది, వర్గాలు ఎన్నో ప్రయాసలకోర్చి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసి సాంకేతిక కారణాలతో ఓట్ల లెక్కింపు రోజున చాలావరకు వాటిని తిరస్కరించారు. ఈ నేపథ్యంలో మరికొద్ది రోజుల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు-2024లో పోస్టల్ బ్యాలెట్(పీబీ) ద్వారా ఓటు వేసే వారు నిబంధనలపై అవగాహన లేకుండా ఓటు వేస్తే పాత కథే పునరావృతం అయ్యే అవకాశం లేకపోలేదు.

ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరూ సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయాలన్న లక్ష్యంతో ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని కొన్ని వర్గాల వారి కోసం తీసుకొచ్చింది. ఈ దఫా 33 కేటగిరీలకు చెందిన ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని కల్పించింది. ఎవరైతే పోలింగ్ రోజున ఎన్నికల విధుల్లో ఉంటారో వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. గత ఎన్నికల్లో ఇటు ఆర్‌వో కార్యాలయ సిబ్బంది పరంగా, అటు పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల పరంగానూ తప్పిదాలు జరిగాయి. 13ఏలో డిక్లరేషన్, గజిటెడ్ అధికారి సంతకాలు సరిగా చేయలేదు. అలానే డిక్లరేషన్‌లో ఉన్న బ్యాలెట్ పేపర్ సీరియల్ నెంబరు, 13బీ కవర్‌పై ఉన్న సీరియల్ నెంబరు ఒకలా ఉంటేనే ఓట్ల లెక్కింపునకు అనుమతిస్తారు. గత ఎన్నికల్లో ఆర్‌వో కార్యాలయ సిబ్బంది 13బీ కవర్‌పై బ్యాలెట్ పేపర్ సీరియల్‌ని సక్రమంగా ముద్రించలేదు. దాంతో భారీ సంఖ్యలో ఓట్లు లెక్కింపు రోజున అవి తిరస్కారానికి గురయ్యాయి. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 2019లో 16,977 మందికి పోస్టల్ బ్యాలెట్‌లు ఇచ్చారు. వారిలో 15,084 మాత్రమే ఓట్ల లెక్కింపునకు వచ్చాయి. వీటిల్లో ఇంచుమించు 70 శాతం వరకు 9,782 ఓట్లు తిరస్కారానికి గురయ్యాయి. కేవలం 5,317 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మాత్రమే లెక్కించారు. గుంటూరు తూర్పులో 1619 బీలకు 274, పశ్చిమలో 3,685కి 312, మంగళగిరిలో 1,679కి 670, రేపల్లెలో 2,528కి 1329 మాత్రమే కౌంటింగ్‌కు అర్హత పొందాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఏదైనా నియోజకవర్గంలో అభ్యర్థుల మధ్యన హోరాహోరీ పోటీ జరిగితే ఫలితం తేల్చేందుకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఎంతో కీలకం అవుతాయి. ఇలా ఓట్లు తిరస్కారానికి గురైతే ఓటర్లు ఆశించిన ఫలితం తారుమారు అయ్యే ప్రమాదం లేకపోలేదు.

రూ.5.5 లక్షల నగదు స్వాధీనం

తెనాలి, మారీసు పేట మార్చి 29: పట్టణం లో త్రీటౌన్ పరిధిలో ఒక వ్యక్తి కారులో తరలిస్తు న్న రూ.3.5లక్షల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీ నం చేసుకున్నారు. త్రీటౌన్ పోలీసుల కథనం మేరకు శుక్రవారం రైల్వేస్టేషన్ వంతెన, సాయిబాబా మందిరం వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో ఇందుపల్లి సాంబశివరావు ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా మంగళగిరి నుంచి తెనాలికి తన కారు లో తరలిస్తున్న నగదును స్వాధీనం చేసుకొన్నారు. ఆ నగదును త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

● తెనాలి రూరల్: ఓ కారులో ఎటువంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.2లక్షల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. గురువారం అర్ధరాత్రి సమయంలో మండలంలోని సంగంజాగర్లమూడి చెక్‌పోస్టు వద్ద ఫ్లయిం గ్ స్క్వాడ్ ఇన్‌చార్జ్ జయంతిబాబు నేతృత్వంలో సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా ఓ కారులో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.2లక్షలను గుర్తించి వాటిని సీజ్‌చేసి రూరల్ పోలీ స్టేషన్‌లో అప్పగించారని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు పేర్కొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.25(శనివారం)

సహోరీ (ఉదయం) 4.47 (ఆదివారం)

శిలువ మరణం.. పాప హరణం

- కన్నీటి ప్రార్థనలతో శుభ శుక్రవారం
- జిల్లా వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో ఉపవాస పూజలు
- కేథలిక్ చర్చిలలో కళ్ళకు కట్టిన 14 స్థలాలు
- మృతుల ఆత్మలకు శాంతి కలగాలని సమాధుల తోటలలో ప్రార్థనలు
- లోక పాప పరిహారానికే క్రీస్తు ప్రభు శిలువ మరణం
- గుడ్ ఫ్రైడే సందేశంలో బిషప్ రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్య

గుంటూరు, మార్చి 29: క్రైస్తవులు అత్యంత ఘనంగా జరుపుకునే పర్వదినాల్లో ఒకటైన శుభ శుక్రవారం (గుడ్ ఫ్రైడే) వేడుకలు శుక్రవారం జిల్లావ్యాప్తంగా అత్యంత భక్తి శ్రద్ధలతో, ఉపవాస ప్రార్థనలతో నిర్వహించారు. అన్ని చర్చిలలో, సమాధుల తోటల్లోనూ కన్నీటి ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా గురువులు, పాస్టర్లు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించి గుడ్ ఫ్రైడే సందేశమిచ్చారు. జిల్లా వ్యాప్తం గా అన్ని చర్చిలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా వేడుకల్లో వివిధ మతాలకు చెందిన వారు సైతం పాల్గొని సర్వమత సమానత్వాన్ని చాటారు. అదేవిధంగా చనిపోయిన కుటుంబ సభ్యులు, బంధువు ల ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ సమాధుల తోటల్లో కన్నీటి ప్రార్థనలు నిర్వహించారు. వారిని గుర్తు చేసుకుంటూ ఆయా సమాధులపై పుష్పగుచ్ఛాలు ఉంచి క్యాండిల్స్ వెలిగించి ప్రార్థనలు చేశారు. నగరంలోని రింగ్ రోడ్డులో గల నిత్య సహాయ మాత ఆలయంలో ప్రత్యేక దివ్యబలి పూజ జరిగింది. ఈ సందర్భంగా క్రీస్తు శిలువ వేయబడిన విధానాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరై క్రీస్తు శిలువ మార్గం దృశ్యాలను తిలకించారు. ఈ సందర్భంగా జరిగిన దివ్యబలి పూజలో బిషప్ రెవరెండ్ చిన్నాబత్తుని భాగ్యయ్య మాట్లాడుతూ సర్వమానవాళిని పాప విముక్తులను చేయడానికే క్రీస్తు ప్రభువు శిలువ మరణం పొందారన్నారు. పూజా కార్యక్రమంలో విచారణ గురువ ఫాదర్ లూయిస్‌తో పాటు పలువురు గురువులు, కన్యా స్త్రీలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అదేవిధంగా గుంటూరులోని ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న పునీత ఆగ్నేసమ్మ దేవాలయంలో విచారణ గురువు ఫాదర్ రెవరెండ్ ఏరువబాల, సహాయ గురువు రెవరెండ్ ఫాదర్ సాగర్ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరిగాయి. స్తంభాలగరువులోని ఆగ్జిలియం స్కూల్‌లో గల దివ్య బాలయేసు దేవాలయంలో రెవరెండ్ ఫాదర్ చిన్నాబత్తిని జోసఫ్ చార్లెస్ ఆధ్వర్యంలో పూజ నిర్వహించారు. నగరంపాలెంలోని పునీత అంతోనివారి దేవాలయంలో విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ పెంటారెడ్డి రాజారెడ్డి ఆధ్వర్యంలో, అదేవిధంగా గోరంట్లలోని ఆరోగ్య మాత ఆలయంలో విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ నరిశెట్టి బాలశౌరి, ఫాదర్ నరిశెట్టి అల్ఫోన్స్ ఆధ్వర్యంలో, అమరావతి రోడ్డులోని వెళాంగినిరోడ్డులో గల వెళాంగిణిమాత ఆలయంలో విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ మర్రి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో, బొంగరాలబీడులోని లూర్దు మాత ఆలయంలో విచారణ గురువు ఫాదర్ రేపూడి రాయప్ప ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే పూజ జరిగింది.

ఎఇఎల్‌సి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు

నగరంలోని ఎఇఎల్‌సి చర్చిలలో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. లాడ్జి సెంటర్‌లోని నార్త్ ప్యారిస్ చర్చిలో బిషప్ రెవరెండ్ ఎస్‌జె బాబూరావు, రెవరెండ్ ఎన్ఎస్ జేమ్స్ సుధీర్, మధుబాబు ఆయా ప్రార్థనలు నిర్వహించారు. హిందూ కళాశాల వెనుక ఉన్న వెస్ట్ ప్యారిస్ చర్చిలో పాస్టర్లు రెవరెండ్ సతీష్‌కుమార్, రెవరెండ్ చార్లెస్, టి శాంతారావు, తదితరులు గుడ్‌ఫ్రైడే సందేశం ఇచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాత బస్టాండ్ వద్ద ఉన్న ఈస్ట్ ప్యారిస్ చర్చిలో పాస్టర్లు రెవరెండ్ చక్రదర్, రెవరెండ్ దేవసహాయం, రెవరెండ్ మోహన్‌బాబు ప్రార్థనలు చేశారు. ఏటి అగ్రహారంలోని సౌత్ ప్యారిస్ చర్చిలో రెవరెండ్ సురేష్‌బాబు, గుడ్‌ఫ్రైడే సందేశం ఇచ్చి ప్రార్థనలు నిర్వహించారు. కొత్తపేట కుగ్లర్ ఆసుపత్రి ఆవరణలోని ట్రినిటి ప్యారిస్‌లో పాస్టర్లు రెవరెండ్ జె. దైవాశీర్వాదం, రెవరెండ్ వి క్రిష్టాఫర్, మాన్యం చర్చిలో రెవరెండ్ భాస్కర్ ఆయా ప్రార్థనలు చేసి భక్తులకు గుడ్ ఫ్రైడే సందేశమిచ్చారు.

భక్తులతో కిక్కిరిసిన సమాధులతోట

నగరంలోని పాతగుంటూరు పరిధిలో గల ఆనందపేట సమాధులతోట భక్తుల రద్దీతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో మృతుల కుటుంబ సభ్యులు వారి సమాధుల వద్ద క్యాండిల్స్ వెలిగించి ప్రార్థించారు. గుర్రం జాషువాతో సహా పలువురు ప్రముఖుల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంట్ జనసేన, బీజేపీ బలపరిచిన టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిరాల జోసఫ్ ఇమ్మాన్యుయేల్ (మ్యాని)తో పాటు వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, వివిధ మతాలకు చెందిన వారు పాల్గొన్నారు.


దారి బాటల్లో ఏసుప్రభువును కొరడాలతో కొడుతున్న ఘట్టాలు


నగరంలో ర్యాలీగా వెళుతున్న దళిత సోదరులు

అమరావతిని అభివృద్ధి చేసి చరిత్రలో నిలవాలి

● 1564వ రోజుకు చేరుకున్న ఆందోళనలు



బిల్డ్ అమరావతి అంటూ తుళ్లూరులో ఇళ్ల వద్ద నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్ళూరు, మార్చి 29: అధికారం ఉంది కదా అని అమరావతిని నిర్వీర్యం చేసి సీఎం జగన్‌రెడ్డి అడ్డగోలుగా వ్యవహరించారని, రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగంచేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1564వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వెంకటపాలెం రైతుల ధర్నా శిబిరం, రాజధాని గ్రామాల్లో ఇళ్ల వద్ద నుంచి నిరసన దీక్షలు, ఆందోళనలు చేస్తున్న పలువురు రైతులు, మహిళలు మాట్లాడారు. పదవులు ఎప్పుడూ అధికారం శాశ్వతంగా కాదన్నారు. సీఎం జగన్‌రెడ్డి ప్రజావేదిక కూల్చివేసి, పోలవరం, అమరావతి నిర్వీర్యం చేసి చరిత్ర హీనుడని ప్రజలు చెప్పుకునే విధంగా ఈ ఐదేళ్ల పరిపాలన చేశాడన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చెప్పిన తీర్పును లెక్క చేయకుండా కాలక్షేపం చేసేవారిని ఎన్నికల్లో అడ్రస్ లేకుండా చేయాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో రైతుల నిరసన దీక్షలు, ఆందోళన కొనసాగాయి.

తెలుగువాడి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్

● మాజీ మంత్రి ఆనందబాబు



ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించిన అనంతరం ప్రసంగిస్తున్న మాజీమంత్రి ఆనందబాబు

వేమూరు, మార్చి 29: ఎన్టీఆర్ స్ఫూర్తితో రాష్ట్రాన్ని పునరుజ్జీవింప చేసుకునే అవసరం ఎంతైనా ఉందని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన వేమూరులోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన ఆనందబాబు ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రతీక ఎన్టీఆర్ అన్నారు. నాడు ఆయన ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ఈనాడు దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు అమలులోకి తెచ్చాయన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్, నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, బీసీ సంఘ నేత తులం రమేష్‌బాబు, పల్లా వాసుదేవరాయుడు, చావలి సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాసరావు, తెలుగు రైతు నాయకులు బండారు సూరిబాబు, వేమూరి మురళీకృష్ణ, మన్నే పసి, గోపినాధ్, రాజేష్, కొండ్రుబుల్లియ్య, అనే ప్రసాద్, యలవర్తి సురేంద్ర, కోగంటి శ్రీనుబాబు, శివకృష్ణ, వేల్పుల రవి, ఉక్కుర్తినాగయ్య, దాది లక్ష్మణరావు, గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో వైసీపీకి బిగ్ షాక్

● మల్లెల రాజేష్ నాయుడు సహా..
● 25 మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన రాజేష్ నాయుడు తదితరులతో నారా లోకేశ్, పుల్లారావు

చిలకలూరిపేట, మార్చి 29: చిలకలూరిపేటలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. చిలకలూరిపేట వైసీపీ అభ్యర్థిగా తొలుత ప్రకటించబడి అవమానానికి గురైన మల్లెల రాజేష్ నాయుడు, కొలిశెట్టి శ్రీనివాసరావు, 10 మంది మునిసిపల్ కౌన్సిలర్లు, ఒక జడ్పీటీసీ సహా మొత్తం 25 మంది వైసీపీ ముఖ్యులు ఆ పార్టీని వీడి తెలుగుదేశంలో చేరారు. హైదరాబాదులో శుక్రవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, మాజీ మంత్రి, చిలకలూరిపేట టీడీపీ అభ్యర్థి పత్తిపాటి పుల్లారావు సమక్షంలో వీరంతా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. లోకేష్ వీరందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు.

ప్రస్తుతం ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ఉండి, మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి విడదల రజినిపైనా కొద్ది రోజుల క్రితమే రాజేష్ నాయుడు సంచలన ఆరోపణలు చేశారు. రజిని నిష్క్రమణ అనంతరం ఇప్పటి వరకు వైసీపీ సమన్వయకర్తగా కూడా ఉన్న ఆయన మంత్రి రజిని రు.6.5 కోట్లు డబ్బు తీసుకుని మోసం చేశారని వెల్లడించారు. అదే విషయంపై ప్రభుత్వ సలహాదారు సజ్జల వద్ద పంచాయతీ కూడా జరిగిందని బాంబు పేల్చారు. అనంతరం పరిణామాల్లోనే ఆకస్మికంగా చిలకలూరిపేట అభ్యర్థిని మార్చిన సీఎం జగన్.. రాజేష్ నాయుడు స్థానంలో కావటి మనోహర్ నాయుడుకు బాధ్యతలు ఇచ్చారు.

అన్యాయాలను భరించలేకనే పార్టీని వీడాం : మల్లెల

ఈ సందర్భంగా రాజేష్ నాయుడు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో వైసీపీ విజయానికి తనతో పాటు ఎంతోమంది నాయకులు దోహదపడ్డారన్నారు. కొంతకాలంగా అక్కడ జరుగుతున్న విపరీత పరిణామాలు, ఆ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలపై విసుగు చెంది, తమకు జరిగిన తీవ్ర అన్యాయాన్ని భరించలేకే వైసీపీని వీడాల్సివచ్చిందన్నారు. ఐదేళ్లుగా చిలకలూరిపేటలో మంత్రి విడదల రజిని భూదందాలు మొదలు నిరుపేదలు, చిన్న చిన్న వ్యక్తుల పొట్టకొట్టడం కూడా జరిగిందన్నారు. ఆ తర్వాతే చిలకలూరిపేటలో గెలవడం అసాధ్యం, ఇక ఎందుకు పనికిరానని తెలుసుకొని గుంటూరు పశ్చిమలో సీటు సాధించుకున్నారన్నారు. స్థానిక వ్యక్తికే సీటు కేటాయించాలని ఎన్నోసార్లు కోరనా పట్టించు కోలేదన్నారు. అందుకే మన చిలకలూరిపేటను మనమే బాగుచేసుకోవాలనే ఉద్దేశంతో టీడీపీని, ప్రత్తిపాటి పుల్లారావును బలపరచాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరికలు

టీడీపీలో చేరినవారిలో యడ్లపాడు మండల జడ్పీటీసీ సభ్యులు ముక్తా వాసు, చిలకలూరిపేట మునిసిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, మునిసిపల్ కౌన్సిలర్లు తులం సుధాకర్, చెమిటిగంటి పార్వతిదేవి, బిట్రా రాజేంద్రప్రసాద్, షేక్ జమీలా, జాలాది సుబ్బారావు, కౌన్సిలర్, వైసీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేరింగ్ మౌలాలి, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు పంగులూరి వెంగళరాయుడు, గణపవరం కు చెందిన బెల్లంపల్లి అచ్చయ్య, కాట్రు శ్రీనివాసరావు, కట్టుబడి వారి పాలెంకు చెందిన మాజీ సర్పంచ్ తిమ్మిశెట్టి కోటేశ్వరరావు, వైసీపీ సీనియర్ నాయకులు గాలి బుచ్చయ్య, బీసీసెల్ పట్టణ అధ్యక్షుడు, వైసీపీ ముఖ్య నాయకుడు ఎం.వి.రత్నారెడ్డి, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు యాదాల సుజాత, బుక్కాపురం సర్పంచ్ అల్లం ఆంజనేయులు, విద్యార్థి విభాగం నాయకులు నాగూర్, ఇక్బాల్, గౌసేలు, సీనియర్ నాయకులు రామిశెట్టి తాండవేశ్వరరావు, తోట సీతయ్య, కోట నాగపూర్ణచంద్రరావు, గుంజి బాజిలతోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

గెలిస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు
● చెత్తపై పన్నువేసిన చెత్త ముఖ్యమంత్రి జగన్: కన్నా



ప్రజలకు అభివాదం చేస్తున్న శ్రీకృష్ణ దేవరాయులు, కన్నా

ముప్పాళ్ళ మార్చి 29: రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం అనుకుంటేనే ఓటు వేయాలని, నిజాయితీ నిబద్ధత కలిగినవారిని గెలిపించాలని నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ఇరుకుపాలెం, రుద్రవరం, తొండపి, దమ్మాలపాడు, బొల్లవరం, ముప్పాళ్ళ, గోళ్ళపాడు, కుందురువారిపాలెం, లంకెలకూరపాడు, పలుదేవర్లపాడు గ్రామాల్లో శుక్రవారం బీజేపి, జనసేన నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ వరికెపూడిశెల ప్రాజెక్టును పూర్తిచేసి తాగునీటి సమస్యలను తీరుస్తానన్నారు. కన్నా మాట్లాడుతూ చెత్తపై పన్నువేసిన చెత్త ముఖ్యమంత్రి జగన్ అన్నారు. రాష్ట్రం ఆర్థికంగా వెనుక బడిందన్నారు. ముప్పాళ్ళలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, సర్పంచులు మల్లవరపు చంద్రశేఖర్, పోలూరి యలమంద, పాతూరి అయోధ్య, గోగినేని కోటేశ్వరరావు, రావిపాటి మధుబాబు, నానయ్య, గంగారాం ఖాశిం, లీలాఫర్, మాభుసుభాని, రవీంద్రారెడ్డి, శిరిగిరి వెంకటరావు, తోడేటి రవి, మనోజ్, అబ్దుల్ మజీద్, అత్తోట కృష్ణ, డివి నారాయణ, ఉగ్గం యలమందరావు, గుత్తా రామారావు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో బారీగా టీడీపీలో చేరికలు

మండల టీడీపీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో వైసీపీ నాయకులు కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, కన్నా లక్ష్మీనారాయణలు కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇరుకుపాలెంలో ఎంపీటీసీ బత్తుల విజయలక్ష్మి ఆమె భర్త రామకృష్ణ మరి కొందరు, కూరపాడులో యర్రం మస్తాన్‌రెడ్డి, యర్రం అప్పిరెడ్డి, మలిరెడ్డి చంద్రారెడ్డి, మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి(పెదకాపు), మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మలిరెడ్డి బ్రహ్మారెడ్డి, ఎస్కే మస్తాన్‌వలి, పలుదేవర్లపాడులో ఉపసర్పంచ్ లావు సాంబశివరావు, కంచేటి కుచేలరావు, చక్రవరపు బ్రహ్మారాజు మరో 10మంది, ముప్పాళ్ళలో 10 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

ఎన్నికల అధికారిపై వైసీపీ నిఘా: ధూళిపాళ్ళ

● సాక్షి భవనారాయణ స్వామి ఆలయం భూముల అన్యాక్రాంతానికి జీవో



సమావేశంలో మాట్లాడుతున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, మార్చి29: ఎన్నికల అధికారిపై వైసీపీ నాయకత్వం సొంత పత్రిక విలేకరిని నిఘా పెట్టి బెదిరింపులు ప్రలోభాలకు గురిచేయాలని చూస్తున్నారన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపించారు. శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడు ఫోన్ సంభాషణే ఇందుకు ఆధారం అని స్పష్టం చేశారు. సదరు నాయకుడు వైసీపీ సొంత పత్రిక విలేకరికి ఫోన్ చేసి ఎన్నికల అధికారి ఎవరెవ్వరిని కలుస్తున్నారో, ఎక్కడి వెళ్లుతున్నారు, ఏం చేస్తున్నారు మొత్తం వివరాలు నిఘా పెట్టాలని ఆ ఫోన్ సంభాషణలో కోరినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన ఆడియో సరైన సమయంలో విడుదల చేస్తామన్నారు. సంబంధం లేని విషయంలో తమను ఇరికించాలనే ప్రయత్నాలను మానుకోవాలని నరేంద్ర స్పష్టం చేశారు. ఎన్నికల అధికారులను వైసీపీ పెద్దలు భయపెట్టి, ప్రలోభపెట్టి తమకు అనుకూలంగా వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపిన సైకిల్ వ్యవహారంలో ప్రభుత్వమే సిగ్గు పడాలిసిన అవసరం ఉందన్నారు. పేద బాలికలు బడికి వెళ్లటానికి 2019 ముందు ప్రభుత్వం ఉచితంగా సైకిళ్లను అందచేసిందన్నారు. ఆ సైకిళ్లను కూడా ఎన్నికల కేసు సాకు చూపి వదిలివేశారన్నారు, అయితే కోర్టు ఆదేశాల ప్రకారం ప్రభుత్వ ఆస్థిని వేలం వేయగా ఓ ప్రైవేటు వ్యక్తి వాటిని వేలంలో పాడుకున్నారన్నారు. ఆ సైక్కిళ్లు పంపిణీ చేస్తున్నారని తప్పుడు ఫిర్యాదు అందచేసిన వ్యక్తి ఎవరో బహిరంగ పరిచే ధైర్యం అధికారులకు ఉందా అని ప్రశ్నించారు.

భవనారాయణ స్వామి భూముల కబ్జాకు యత్నం..

సాక్షి భవనారాయణ స్వామి ఆలయానికి చెందిన విలువైన భూములు కబ్జా చేయటానికి వైసీపీ నాయకుల ప్రయత్నాలు కొనసాగుతున్నాయని నరేంద్ర ధ్వజమెత్తారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావటానికి సరిగా మూడు రోజుల ముందు 16 ఎకరాల భవనారాయణ స్వామి భూమిని లాంగ్ లీజ్‌కు ఇవ్వాలని దేవాదాయ శాఖ ఉత్తర్వులు ఇవ్వటం అనుమానాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కన్ను ఈ భూములపై పడిందని ఆరోపించారు. ఈ భూములపై కన్ను ఉన్నందునే రోశయ్య తన సతీమణిని పాలకవర్గ సభ్యురాలుగా చేర్చారని ఆరోపించారు. ఈ విషయంపై తాము గతంలో పోరాడితే ఆటోనగర్‌కు అడ్డంకులు సృష్టిస్తున్నారని తమపై దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. 22ఎ చట్టం క్రింద భూములు నమోదై సామాన్యులు పడుతున్న ఇబ్బందులు ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. అనమర్లపూడి గ్రామంలో దళితులకు సంబంధించిన 23 ఎకరాల భూములను కూడా ఇలాగే ఉత్తర్వులు తెచ్చుకొని హస్తగతం చేసుకున్నారని ఆరోపించారు. వీటన్నిటిపై సమగ్ర విచారణ కోరనున్నట్లు నరేంద్ర కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలే టీడీపీకి శ్రీరామరక్ష

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



ఎన్టీఆర్, డాక్టర్ కోడెల ప్రతిమలకు నివాళులర్పిస్తున్న జీవీ ఆంజనేయులు, డాక్టర్ చదలవాడ, డాక్టర్ కడియాల, గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు

నర సరావుపేట టౌన్, మార్చి 29: టీడీపీ జెండాలు మోసిన లక్షలాదిమంది కార్యకర్తల కృషి మరచిపోలేనిదని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయం ఆవరణలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అన్న ఎన్టీ రామారావు, డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రతిమలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కార్యకర్తలే టీడీపీకి శ్రీరామరక్ష అనిఅన్నారు. పార్టీ ఆశయసాధన కోసం కృషిచేస్తున్న ప్రతి కార్యకర్తలకు శుభాకాంక్షలు, ధన్యవాదాలు తెలిపారు. దేశ చరిత్రలోనే మహిళలకు ఆస్తిహక్కు కల్పించిన ఘనత అన్న ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ 42 ఏళ్ళుగా పార్టీకి అండగా ఉండి, పార్టీకి వెన్నంటి కార్యక్రమాలు ముందుకు తీసుకెళుతున్న నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి కొట్టా కిరణ్‌కుమార్ ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, యువనేత డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, అట్లా చినవెంకటరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రియాదవ్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కమ్మెత కోటిరెడ్డి, వేములపల్లి వెంకటనరసయ్య, కొల్లి ఆంజనేయులు, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు, అడుసుమల్లి అప్పారావు, టీడీపీ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ మాబు, టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అధ్యక్షుడు పూదోట ఆంథోని సునీల్‌కుమార్, రాపర్ల జగ్గారావు, మైనారిటీ సెల్ నియోజకవర్గ అధికార ప్రతినిధి షేక్ మన్నాన్ షరీఫ్, కనుమూరి లక్ష్మీ, దాసరి ఉదయశ్రీ, అల్లంశెట్టి మోహనరావు, జాగర్లమూడి హనుమంతురావు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదాం

● గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని పిలుపు



దాచేపల్లిలో బీజేపీ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని

దాచేపల్లి, మార్చి 29: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడమే లక్ష్యంగా పనిచేయాలని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం నారాయణపురంలోని నాగిరెడ్డి కల్యాణ మండపంలో బీజేపీ గురజాల నియోజకవర్గ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన యరపతినేని మాట్లాడుతూ కేంద్ర పథకాలన్నీ రాష్ట్రప్రభుత్వ పథకాలుగా చెప్పుకుంటూ రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోందన్నారు. గత 40 ఏళ్లలో ఏ ప్రభుత్వం చేయనటువంటి దుర్మార్గాలు, హత్యలు, దోపిడీలు, మైనింగ్ మాఫియా ఈ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో జరిగిందన్నారు. రానున్న టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా అందరం కలిసి పనిచేద్దామని యరపతినేని పిలుపునిచ్చారు. బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఆలోకం సుధాకర్‌బాబు, కొక్కెర శ్రీనివాసయాదవ్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధుల తో చేసిన అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం తమ పార్టీ రంగులు వేసి జగన్ బొమ్మలు వేశారని విమర్శించారు. ఆఖరుకు పేద ప్రజలకు అందిస్తున్న ఉచిత బియ్యం కూడా ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం అందిస్తున్నవేనని తెలిపారు రానున్న ఎన్నికలలో ఎన్‌డీఏ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావును భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బిజెపి నాయకులు కేతనబోయిన హనుమంతరావు, పునుగుల రవిశంకర్, ముచ్చల వెంకట మనోజ్, ఆరె వెంకటేశ్వర్లు, మల్లెమారపు నాగేశ్వరరావు, బొడ్డు పెదనరసింహారావు, కొఠారి సురేష్, సైదారావు, కేశానుపల్లి నరసింహారావు, స్వర్ణ సుబ్బారావు, గురజాల, మాచవరం మండలాల బిజెపి అధ్యక్షులు, టీడీపీ నాయకులు బెల్లంకొండ భద్రి, తంగెళ్ల శ్రీనివాసరావు, డాక్టర్ కర్నాటి వరలక్ష్మీ, జనసేన నేతలు మందపాటి దుర్గారావు, బడిదల శ్రీనివాసరావు, అంబటి మల్లి తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.16 కోట్ల నగదు సీజ్

గుంటూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకోడ్ అమలులో ఉన్నందున ఈసీ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి పత్రాలులేకుండా తీసుకెళుతున్న నగదుని వివిధ శాఖలు స్వాధీనం చేసుకొంటున్నాయి. కోడ్ అమలులోకి వచ్చినరోజు నుంచి శుక్రవారం వరకు జిల్లావ్యాప్తంగా రూ.1.16 కోట్లను సీజ్‌చేశాయి. పోలీసుశాఖ రూ.70లక్షల వరకు నగదుని స్వాధీనం చేసుకొన్నది. సీజీఎస్‌టీ రూ.40లక్షలు, ఎస్‌జీఎస్‌టీ రూ.3లక్షలు, మిగతా శాఖలు కలిపి మరో రూ.3లక్షల వరకు నగదుని స్వాధీనపర్చుకొన్నట్లు జిల్లా ఎన్నికల అధికారి ఎం వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో కళాశాల లైబ్రేరియన్

● సస్పెండ్ చేస్తూ ఇంటర్‌బోర్డు ఉత్తర్వులు

గుంటూరు(విద్య), మార్చి 29: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ ఇంటర్‌బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. పెనుమాకలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న మస్తాన్‌వలి డిప్యూటేషన్‌పై ఎమ్మెల్యే ముస్తాఫా వద్ద పీఏగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ సదరు ఉద్యోగి తూర్పు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూరిఫాతిమా తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడు. దీనిపై ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి విచారణ చేయాల్సిందిగా ఇంటర్ బోర్డు అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్లు నివేదిక అందడంలో లైబ్రేరియన్ మస్తాన్‌వలిని సస్పెండ్ చేస్తూ ఇంటర్ బోర్డు అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

గడువు దాటాక ఫాం.. 8 దాఖలు

● ఆర్వో లాగిన్‌లో నిలిచిన జాబితా
● వైసీపీ అభ్యర్థి అనుచరులు దాఖలు చేసినట్లు ప్రచారం

వేమూరు, మార్చి 29: ఇతర నియోజకవర్గాలకు చెందిన కొందరు ఓటర్లు వేమూరు నియోజకవర్గానికి తమ ఓటును బదిలీ కోరుతూ ఫామ్ 8 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దాఖలు చేసినట్లు తెలుస్తోంది. సంబంధిత వ్యక్తులు వైసీపీ అభ్యర్థి అనుచరులుగా ప్రచారంలో ఉంది. ఈనెల 16వ తేదీలోగా క్లెయిమ్స్ దాఖలు చేసుకునే అవకాశం ఉంది. ఆ తదుపరి దాఖలు చేసిన వాటిని పరిశీలించే అవకాశం లేకుండా ప్రత్యేక లాగిన్‌లో నిలిచిపోయాయి. అయినప్పటికీ అధికార పార్టీకి చెందిన వ్యక్తులు ఎలాగైనా దాఖలు చేసిన ఫామ్ 8లకు అనుమతి పొందేలా ప్రయత్నిస్తున్నట్లుగా తెలుస్తోంది. 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 25 వరకు నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధి 89గ్రామాల ద్వారా వివిధ రకాల పరిష్కారాలు కోరుతూ 12,652 మంది ఓటర్లు దరఖాస్తు చేశారు. వాటిలో 126 దరఖాస్తులను బీఎల్‌ఓల పరిశీలనకు పంపా రు. బీఎల్‌వోలు 17 దరఖాస్తులను ప్ర త్యేక పరిశీలనకు అధికారులకు పంపా రు. 91దరఖాస్తులను ఈఆర్వోకు దాఖలు చేశారు. 1429 దరఖాస్తులను తిరస్కరించారు. కాగా చివరికి 10,989 దరఖాస్తులను అనుమతించారు. 234 దరఖాస్తులు మాత్రం పెండింగ్లో ఉన్నాయి. ఇదిలా ఉండగా ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఫామ్ 8ల దరఖాస్తుకు ఈనెల 16తో గడువు పూర్తయినప్పటికీ గడువు ముగిశాక కొందరు వ్యక్తులు ఇతర నియోజకవర్గాల నుంచి వేమూరు నియోజకవర్గానికి ఓటు హక్కును మార్చుకునేందుకు దరఖాస్తు చేశారు. 200లకు పైగానే అలాంటి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరిచినట్లు సమాచారం. దీనిపై ఈఆర్‌ఓను వివరణ కోరగా గడువు ముగిశాక దాఖలు చేసి దరఖాస్తులను ఎలాంటి పరిస్థితుల్లోనూ పరిశీలించే అవకాశం లేదన్నారు. అలాంటివన్నీ కూడా ఆర్వో లాగిన్‌లో నిలిచిపోయి ఉంటాయని వివరించారు. ఎలాంటి ఒత్తిళ్ళకు లొంగకుండా ఎన్నికల కమీషన్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తామని తెలిపారు.

వలంటీర్ల తొలగింపు

సత్తెనపల్లి, మార్చి29: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ కార్యక్రమంలో పాల్గొన్నందుకు పట్టణంలోని 11వ వార్డుకు చెందిన వలంటీర్లు కిరణ్ సాగర్, అఖిల్‌లను విధుల నుంచి తొలగించినట్టు మున్సిపల్ కమిషనర్ షమ్మి శుక్రవారం తెలిపారు. వలంటీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు ఎవరూ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనరాదని తెలిపారు.

నాలుగు రోజుల పాటు రెండు ఎక్స్‌ప్రెస్‌ల రీషెడ్యూల్

గుంటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - బీబీనగర్ సెక్షన్‌లో చిట్యాల రైల్వేస్టేషన్ వద్ద అదనపు లూప్ లైన్ నిర్మాణానికి సంబంధించి నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా నాలుగురోజుల పాటు రెండు రైళ్లను రీషెడ్యూల్ చేస్తున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. శుక్రవారం నుంచే ఈ రీషెడ్యూల్ అమలులోకి వచ్చింది. ఏప్రిల్ 1వ తేదీ వరకు నెంబరు. 17230 సికింద్రాబాద్ - త్రివేంద్రం సెంట్రల్ శబరి ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్యాహ్నం 1.20కి బయలుదేరుతుంది. అలానే నెంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా ఉదయం 8.40కి బయలుదేరుతుంది. అలానే మార్గమధ్యలో ఈ రైలుని సుమారు గంట పాటు నిలిపేస్తారు.

వైసీపీకి మాజీ సర్పంచ్ రాజీనామా



యెనుముల పున్నారెడ్డి

గురజాలటౌన్, మార్చి 29: మండలంలోని జంగమహేశ్వరపురం మాజీ సర్పంచ్ యెనుముల పున్నారెడ్డి వైసీపీకి రాజీనామా చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కీలకంగా వ్యవహరించానని, గ్రామంలో వైసీపీ నేతలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



పార్టీ పశ్చిమ కార్యాలయంలో తెలుగుదేశం జెండా ఆవిష్కరిస్తున్న గల్లా మాధవి

పేద ప్రజల సేవే లక్ష్యంగా పని చేస్తా

● టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి

గుంటూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సమాజాన్నే దేవాలయంగా భావించి పేదల సేవే లక్ష్యంగా పని చేస్తానని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం శ్రీనివాసరావుపేట మెయిన్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆమె టీడీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో, ఆయన ఆశయాలే లక్ష్యాలుగా ముందుకు తీసుకెళతానని, పేద ప్రజలకు సేవ చేస్తామని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, మానం పద్మశ్రీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● గుడ్‌ఫ్రైడే వేడుకల్లో మాధవి

క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన గుడ్‌ఫ్రైడే వేడుకల్లో గల్లా మాధవి పాల్గొన్నారు. గుంటూరు బాప్టిస్టు చర్చిలో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభువుకు శిలువ వేసిన రోజుకు గుర్తుగా ప్రతి ఏటా క్రైస్తవులు గుడ్ ఫ్రైడే జరుపుకుంటారని, ప్రభువు అనుగ్రహంతో ప్రజలు చల్లగా ఉండాలని ఆమె కోరుకున్నారు. తిరుపతమ్మ తిరునాళ్ల సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 44వ డివిజన్లో జరిగిన అన్నదాన కార్యక్రమంలో గల్లా మాధవి పాల్గొన్నారు.

గుజ్జనగుండ్లను అన్నివిధాలా అభివృద్ధి చేస్తా : గల్లా

గుంటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉన్న గుజ్జనగుండ్లను తాను గెలిచిన వెంటనే అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గల్లా మాధవి హామీనిచ్చారు. గుంటూరు 39వ డివిజన్ కళ్యాణి నగర్, రైల్వే ట్రాక్, గురుకుల పాఠశాల, నాయిబ్రాహ్మణ కాలనీల్లో మాధవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనేక చోట్ల డ్రైనేజి సమస్యల వలన రోగాలు ప్రబలుతున్నాయని, తమను పట్టించుకునే నాధుడు లేరని స్థానికులు వాపోయారు. మాధవి మాట్లాడుతూ ముస్లింలు అధికంగా వున్న గుజ్జనగుండ్లను వారి ఓట్లతో గద్దెనెక్కిన వైసీపీ మాత్రం పట్టించుకోలేదన్నారు. దుల్హన్ పథకం కింద తాము ఆంక్షలు లేకుండా రూ.50వేలు ఇచ్చేవారమని, 2019 ఎన్నికల ప్రచారంలో రూ.లక్ష ఇస్తానన్న వైసీపీ నాలుగున్నరేళ్లుగా దాని ఊసు ఎత్తకుండా చివరి ఆరు నెలల్లో హడావుడిచేసి వారిని వంచిస్తోందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆంక్షలు లేకుండా రూ.లక్ష ఇస్తామని హామీనిచ్చారు. వక్ఫ్‌బోర్డు భూములు రక్షిస్తామని, మైనారిటీలను ఆర్థికంగా పైకి తెస్తామని మాధవి హామీనిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సింగంశెట్టి వీరయ్య, రుస్తుంబాబు, శ్రీకాంత్, షేక్ రఫీ, వల్లంశెట్టి వీరయ్య , ఈశ్వర్, మస్తాన్ వలి, బాజీ, వెంకటేశ్వరావు, సుబ్బారావు, ఆరోగ్యరావు, నిరీక్షణరావు, ప్రభుదాస్, బాల కోటమ్మ, జనసేన అధ్యక్షుడు చేజర్ల శివకుమార్ పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ గొప్ప ప్రజా పోరాట యోధుడు

గుంటూరు, మార్చి 29: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గొప్ప ప్రజా పోరాట యోధుడని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గల్లా మాధవి ప్రశంసించారు. శుక్రవారం పార్వతిపురంలో జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల హరి స్వగృహంలో జనసైనికులతో ఆమె మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనపై జనసైనికుల పోరాటం ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆళ్ల హరి మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి గల్లా మాధవిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకొనేందుకు క్షేత్రస్థాయిలో టీడీపీ, బీజేపీతో కలసి జనసైనికులు కృషి చేస్తారని వెల్లడించారు. అనంతరం రెల్లి యువత నాయకులు సోమి ఉదయ్‌కుమార్, డివిజన్ జనసేన అధ్యక్షుడు సయ్యద్ షర్ఫుద్దీన్, బీసీ నాయకుడు రోశయ్యలు గల్లా మాధవిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో షేక్ నాజర్, నందూరి స్వామి, గొట్టిపాటి రమేష్, గల్లా జానకీదేవి, బాషా, పడిగిపోగు రమేష్, తాడికొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నసీర్

తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక టీడీపీ

● తూర్పు నియోజకవర్గ అభ్యర్థి మొహమ్మద్ నసీర్

గుంటూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక తెలుగుదేశం పార్టీ అని ఆ పార్టీ గుంటూరు తూర్పు నియోజకవర్గ అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన తన కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో నందమూరి తారక రామారావు పార్టీని ఏర్పాటు చేశారని, కేంద్రం ఆంధ్ర రాష్ట్రాన్ని చులకనగా చూస్తున్న తరుణంలో తెలుగు వారి ఆత్మ గౌరవం కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించారని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల వారికి సముచిత స్థానాన్ని ఇస్తూ, వారికి రాజకీయాల్లో తగిన ప్రాధాన్యాన్ని ఇచ్చారని, అవే ఆశయాలను కొనసాగిస్తూ చంద్రబాబు పార్టీని మరింత ముందుకు నడిపారని చెప్పారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజల కోసం నిత్యం పని చేస్తున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని, తెలుగు రాష్ట్రాల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే జరిగిందని స్పష్టం చేశారు.

క్రీస్తు చేసిన త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే : మొహమ్మద్ నసీర్

గుంటూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి కోసం క్రీస్తు చేసిన త్యాగానికి ప్రతీక గుడ్‌ఫ్రైడే అని టీడీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. పాత గుంటూరు 10వ డివిజన్ ఆనందపేటలోని క్రిస్టియన్ సమాధుల వద్ద గుడ్ ఫ్రైడే సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విశ్వశాంతి కోసం, ప్రేమ నిండిన సమాజ స్థాపన కోసం శిలువనెక్కి క్రీస్తు తన రక్తాన్ని చిందించిన రోజు గుడ్‌ఫ్రైడే అని చెప్పారు. ఆయనను ప్రతి ఒక్కరూ మననం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలి సతీష్, రియాజ్, పఠాన్ జమీర్, నాగ మల్లికా, భాస్కర్, వెంకటేశ్వర్లు, బాజీ, గూడూరు వాసు, వీర్రాజు పాల్గొన్నారు

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గుంటూరు(విద్య), మార్చి 29: ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడానికి ప్రత్యేక డ్రైవ్‌ని ఉపాధ్యాయులు నిర్వహించాలని యూటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపునిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం బ్రాడీపేటలోని కార్యాలయంలో ఉమ్మడి జిల్లా యూటీఎఫ్ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ సంస్కరణ పేరుతో ప్రభుత్వం తీసుకువచ్చిన విధానాలు, పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఏఎన్ కుసుమకుమారి, రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారధి, బాపట్ల జిల్లా అధ్యక్షులు జే. వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఏ శ్రీనివాసరావు గుంటూరు జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉవ్వెత్తున ఎగిరిన.. టీడీపీ జెండా

● ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

● పార్టీ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణలు

● తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటింది టీడీపీ: తెనాలి

● బడుగుల అభ్యున్నతి కోసం పుట్టిన పార్టీ: పెమ్మసాని

గుంటూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగాయి. నగరంలోని పలు పార్టీ కార్యాలయాల్లో నేతలు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులతో కలిసి నాయకులు వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ఎన్నికల వాతావరణంలో, సానుకూల పవనాల నేపథ్యంలో పార్టీ నేతలు, శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో వేడుకల్లో పాల్గొన్నారు. పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని ప్రతినబూనారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్ అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థులు మొహమ్మద్ నసీర్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, బీసీ నాయకుడు నిమ్మల శేషయ్య హాజరయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్, నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్‌లు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నేతలు నివాళులర్పించి, కేక్ కట్ చేసి సందడి చేశారు. తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ దగా పడ్డ తెలుగు ప్రజలను ఢిల్లీ నడివీధిలో తలెత్తుకు తిరిగేలా చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని ఆయన గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వ అరాచక పాలన అంతం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని తేల్చిచెప్పారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పుట్టిన పార్టీ టీడీపీ అని, పార్టీ ఆవిర్భావంతోనే ఎన్నో రాజకీయ విప్లవాలు సృష్టించిందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ ప్రభంజనాన్ని ఆపేశక్తి ఎవ్వరికీ లేదని, అందుకే టీడీపీ కార్యకర్తలన్నా,



పార్టీ ఆవిర్భావ వేడుకల్లో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

నాయకులన్నా ప్రపంచంలోనే అంత గౌరవం దక్కిందని తెలిపారు. మొహమ్మద్ నసీర్ మాట్లాడుతూ గతంలో ఎవరికీ అందని సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించిన ఘనత టీడీపీదేనని అన్నారు. బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ పేద ప్రజలు, కార్యకర్తల సంక్షేమం కోసమే ఆవిర్భవించిన ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని కొనియాడారు. గల్లా మాధవి మాట్లాడుతూ అణగారిన వర్గాల అభివృద్ధి కోసం పుట్టిన పార్టీ టీడీపీ అని, తెలుగువారి భవిష్యత్ టీడీపీ అని చెప్పారు. కార్యక్రమంలో భీమినేని వందనాదేవి, గుంటుపల్లి శేషగిరిరావు, వేములకొండ శ్రీనివాస్, కంచర్ల శివరామయ్య, డి.శ్రీనివాసరావు ఈరంటి బాబు, భారతి, రావిపాటి సాయికృష్ణ, అన్నాబత్తుని జయలక్ష్మి, కళ్ళం రాజశేఖర్ రెడ్డి, పప్పుల దేవదాస్, జానీబేగం, దయారత్నం, నేపాక పద్మ, సత్యవాణి, రేణుక, రత్నకుమారి, ఫిరోజ్, హుస్సేన్, వంగర ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవం టీడీపీ: డేగల ప్రభాకర్

తెలుగువారి ఆత్మగౌరవమంటే తెలుగుదేశం పార్టీనేనని టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడడంతోపాటు, పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అన్న నందమూరి ప్రవేశపెట్టారని చెప్పారు. ఆయన ఆశయాలను మరింత ముందుకు తీసుకువెళతూ చంద్రబాబు సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు అందించారన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటు తప్పనిసరి

● స్వీప్ నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ

గుంటూరు, మార్చి 29 : ప్రజాస్వామ్యానికి ఓటు తప్పని సరని యువత గుర్తెరగాలని స్వీప్ నోడల్ ఆఫీసర్ కేవీవీ సత్యనారాయణ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఓటర్ల చైతన్యంపై శుక్రవారం జరిగిన సభలో ఓటింగ్‌పై విస్తృత ప్రచారం కోసం ఏర్పడిన స్వీప్ సంస్థ నోడల్ అధికారి అయిన ఆయన ప్రసంగించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు మనకు ఒక గౌరవమని, ప్రతి ఒక్కరు ఓటు వేయాలని ఐదేళ్ల మనల్ని పరిపాలించే ప్రజాప్రతినిధిని ఎన్నుకోవాలంటే ఓటు వేయాలనే భావన అందరిలో ఉండాలన్నారు. 'ఓటేయటం కన్నా విలువైనది ఏదీ లేదు.. నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను'అని ప్రతి ఒక్కరూ ప్రతిన బూనాలని పిలుపునిచ్చారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, భిక్షపతి, వివిరావు, ఇంజనీర్ ఎస్.సదాశివమ్‌లు ప్రసంగించారు.

ముగిసిన శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల

గుంటూరు(తూర్పు), మార్చి 29 : స్థానిక కొరిటెపాడు అంజనేయపేట శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వాముల వారి తిరునాళ్ల మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. ఉదయం తిరుపతమ్మ, గోపయ్య స్వాముల వారికి పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, అర్చన కార్యక్రమాలు వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముగింపు ఉత్సవాల్లో ముఖ్య అతిథులుగా టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి, టీడీపీ సీనియర్ నాయకులు తాళ్ల వెంకటేష్ యాదవ్, ఉగ్గిరాల సీతారామయ్య, కిలారు ఆదినారాయణ విచ్చేసి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని, అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమాలను ఆలయ నిర్వహకులు కన్నసాని విజయకుమార్(రాజా), రవికుమార్, బాజీ పర్యవేక్షించారు.

విద్యుదాఘాతంతో డాబాపై నుంచి జారిపడి బాలుడి మృతి



మహేష్ మృతదేహం

గుంటూరు, మార్చి 29 : అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమరావతి రోడ్డులో గల అంబేద్కర్‌నగర్‌కు చెందిన లోకం మహేష్(11)ని విద్యుత్ తీగలు చిదిమేశాయి. డాబాపై ఆడుకుంటూ విద్యుదాఘాతంతో కిందపడి బాలుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అంబేద్కర్ నగర్‌లోని ఎన్‌టీఆర్ కాలనీ ఒకటో లైనుకు చెందిన లోకం రాజు, మేరీ దంపతులకు ఐదుగురు సంతానం. తండ్రి రాజు ఐదేళ్ళ క్రితం మృతి చెందాడు. ఇదిలాఉంటే వారి నాలుగో సంతానమైన మహేష్ మూడో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం తోటి స్నేహితులతో కలసి డాబాపై ఆడుకుంటున్నాడు. ఆడుకునే క్రమం లో వారి స్నేహితుడు తడిగా ఉన్న గొడుగు కర్రను డాబా మీదుగా మూడు అడుగుల ఎత్తులో ఉన్న కరెంట్ తీగలపై విసిరాడు. దానిని తీసేందుకు మహేష్ ప్రయత్నించగా విద్యుత్ షాక్‌కు గురై కిందపడి పోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అరండల్‌పేట ఎస్సై ప్రసన్నకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల్లి మేరీ ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రసన్నకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఇంటి మీదుగా విద్యుత్ తీగలు వెళ్ళడం వల్ల ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముగ్గురు పోలీస్ అధికారులకు ఉగాది పురస్కారాలు

గుంటూరు, మార్చి 29 : జిల్లాలో పని చేస్తున్న ముగ్గురు పోలీస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాలు ప్రకటించింది. జిల్లా క్రైమ్స్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతురాజు, సౌత్ డీఎస్పీ మహబూబ్ బాషాలకు ఉగాది పురస్కారాలు లభించాయి. అలాగే అదనంగా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతురాజుకు డీజీపీ బ్రాంజ్ డిస్క్ లభించింది. విధి నిర్వహణలో సమర్థవంతంగా పని చేసిన అధికారులను గుర్తించి ఈ అవార్డులకు ఎంపిక చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. కాగా ఆయా అవార్డులు అందుకున్న పోలీస్ అధికారులను ఉన్నతాధికారులు, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందించారు.

టీడీపీ గెలుపునకు మాదిగలు కృషి చేయాలి

● స్వర్ణాంధ్రా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఏసుబాబుమాదిగ

గుంటూరు(తూర్పు), మార్చి 29 : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్న టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి గెలుపునకు మాదిగలు కృషి చేయాలని స్వర్ణాంధ్రా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ పిలుపునిచ్చారు. స్థానిక గోరంట్లలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ కోసం గతంలో చంద్రబాబు కృషి చేశారని, అలాగే బీజేపీ కూడా మద్దతు ఇచ్చిందని, ఈ కారణంగా కూటమికి మద్దతు, రాష్ట్ర వ్యాప్తంగా కూటమి అభ్యర్థుల తరుపున ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా వర్గీకరణ సాధనకై గొంతు వినిపించడానికి పార్లమెంట్ సభ్యుల గెలుపునకు ప్రచారాలు, చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. చర్చిలను అభివృద్ధి చేస్తామని చెప్పిన గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ విజయానికి ఎస్సీ కాలనీలు, మాదిగపల్లెలో ప్రచారం చేస్తామని తెలిపారు. అలాగే సంఘ గుంటూరు జిల్లా నూతన అధ్యక్షుడిగా మక్కెన ప్రభాకర్‌ను నియమిస్తున్నట్టు ప్రకటించారు. సమావేశంలో సూరీడు పార్టీ అధ్యక్షుడు ఈమని చంద్రశేఖర్, సంఘ నాయకులు సుబ్బయ్య, రమణ, ప్రసాదు, భవాని, ఆశోక్, మస్తాన్, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసుబాబుమాదిగ, పాల్గొన్న ఈమని చంద్రశేఖర్ తదితరులు

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

● తూర్పు నియోజకవర్గ ఆర్వో కీర్తి చేకూరి

● రూ.7.67 లక్షల నగదు సీజ్



పట్టుబడ్డ నగదును స్వాధీన పరుచుకున్న ఎన్నికల తనిఖీ సిబ్బంది

గుంటూరు(కార్పొరేషన్), మార్చి 29: సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) కీర్తి చేకూరి శుక్రవా రం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో నిర్దేశిత అనుమతి లేకుండా తరలిస్తున్న ఎన్నికల ప్రచార సామగ్రిని సీజ్ చేసి ఎఫ్ఐఆర్ బుక్ చేశామని, రాజకీయ పార్టీల ప్రకటనలు ఉన్న బైక్, విద్యాసంస్థ బస్‌ల యజమానులపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే వివరాలు చూపని రూ.7,62,850 నగదు కూడా సీజ్ చేశామని తెలిపారు.

పోలీసుల తనిఖీలో రెండు లక్షలు...

గుంటూరు, మార్చి 29 : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని జేకేసీ కాలేజి రోడ్డులోని చెక్ పోస్టు వద్ద శుక్రవారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో రెండు లక్షల నగదు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జేకేసీ కాలేజి రోడ్డులో పోలీస్ బృందాలు వాహన తనిఖీలు చేపట్టాయి. దీనిలో భాగంగా సత్తెనపల్లికి చెందిన తమ్మిశెట్టి లక్ష్మయ్య కారులో రెండు లక్షల నగదు పట్టుబడింది. అయితే ఆ మొత్తానికి ఎటువంటి బిల్లులు లేకపోవడంతో నగదు సీజ్ చేసి ట్రెజరీ అధికారులకు అప్పగించారు. బాధితుడు ఆ మొత్తం మిర్చి విక్రయించిన డబ్బు అని చెప్పినప్పటికీ బిల్లులు లేకపోవడంతో నగదు సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.





గుంటూరు ఆనందపేటలోని సమాధుల వద్ద శుక్రవారం పూజలలో పాల్గొన్న పెమ్మసాని చంద్రశేఖర్, రామాంజనేయులు, మ్యాని, క్రైస్తవులు

కత్తితో కానిది కరుణతో సాధ్యం!

● టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కత్తితో సాధ్యం కానిది కరుణతో సాధించవచ్చని టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా గుంటూరు ఏటుకూరు రోడ్డులోని ఆర్‌సీఎం చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని శిలువ మోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షతో సాధించలేనిది, క్షమతో సాధించగలం అన్న ఏసు వాక్యాలను ప్రతి ఒక్కరు గుర్తు చేసుకోవాలన్నారు. పేదరికంలో ఉన్నవారికి తాము మేలు చేయడానికి వచ్చామని, నిజమైన సేవ చేయాలని వచ్చిన తమకు సహకరించాలని కోరారు. ప్రత్తిపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ మానవజాతి బాగుకోసం ఏసు శిలువ ఎక్కారని అన్నారు. వెలుతురు వైపు చూడాలి, అభివృద్ధి వైపు అడుగులు వేయాలే తప్ప ప్రజలను యాచకులను చేసి, వెన్నెముకలు విరగ్గొట్టే నాయకులను దరి చేరనివ్వకూడదని తెలిపారు. అనంతరం ఫాదర్ బాలశౌరి ఇరువురు నాయకులను ఉద్దేశించి ప్రార్థనలు చేసి, ఆశీర్వాదం అందజేశారు.



శిలువధారి అయిన పెమ్మసాని చంద్రశేఖర్

అవమానాల నుంచి పుట్టిన గళమే జాషువా: పెమ్మసాని

గుంటూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎన్నో అవమానాలను, అవహేళనలను దిగమింగుకొని జాషువా తన గళాన్ని కవితల రూపంలో ప్రపంచానికి చాటి చెప్పారని టీడీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా గుంటూరు ఆనందపేటలోని క్రైస్తవ సమాధుల తోటలోని ప్రజాకవి గుర్రం జాషువా సమాధి వద్ద పెమ్మసాని నివాళులర్పించారు. జాషువా సమాధిపై పూలమాలలు ఉంచి జాషువాకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పెమ్మసానితోపాటు ప్రత్తిపాడు నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, మైనార్టీ సెల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మ్యాని తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

● రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

గుంటూరు, మార్చి 29: కరుణ చూపడం, క్షమించడం...ఈ రెండూ క్రీస్తు చూపిన మార్గాలని, ఆయన చూసిన మార్గం అనుసరణీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం నార్త్ ప్యారిష్ చర్చిలో మంత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మానవాళిని పాపాల నుంచి రక్షించడం కోసం ప్రభువైన క్రీస్తు తన ప్రాణాలను అర్పించిన రోజు గుడ్ ఫ్రైడే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిషప్ బాబురావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాతగుంటూరు సుద్దపల్లి డొంకలోనున్న సమాధుల్లో గుర్రం జాషువా సమాధి వద్ద ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

జాషువా సమాధికి ఎమ్మెల్యే ముస్తఫా, నూరిఫాతిమా నివాళులు

గుడ్‌ఫ్రైడే పురస్కరించుకొని తూర్పు ఎమ్మెల్యే ఎండీ ముస్తఫా, కుమార్తె, తూర్పు వైసీపీ అభ్యర్థి నూరిఫాతిమా, ఇతర నాయకులు పాతగుంటూరు సుద్దపల్లి డొంకలోనున్న క్రైస్తవ సమాధులను సందర్శించి గుర్రం జాషువా సమాధికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. ఏసుక్రీస్తు మహా త్యాగమే గుడ్ ఫ్రైడే అని అన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ నేటి యువతరం క్రీస్తు సూచించిన శాంతి బోధనలు అనుసరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలున్నారు.

దాతల సాయం స్ఫూర్తిదాయకం

● కేజేఎస్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సామినేని, చుక్కపల్లి రమేష్

● నూతన భవన సముదాయానికి వరుస విరాళాలు

గుంటూరు(తూర్పు), మార్చి 29 : వసతి గృహానికి, నూతన భవన సముదాయానికి పేద విద్యార్థులకు ఆర్థిక తోడ్పటును అందిస్తున్న దాతల సాయం స్ఫూర్తిదాయకమని కమ్మజన సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్ కొనియాడారు. స్థానిక జేకేసీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయానికి దాతలు శుక్రవారం వరుస విరాళాలను అందించారు. అందులో భాగంగా జ్యోతిర్మయి టెక్స్‌టైల్స్ ప్రైవేటు లిమిటెట్ చైర్మన్ దండా బ్రహ్మానందం రూ.6,55,000/-, ఎల్ఎం ఆటో టెక్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత పాములపాటి రవీంద్రబాబు రూ.6 లక్షలు, మరో దాత మైనేని సీతారామయ్య కుమారుడు మైనేని కోటేశ్వరరావు రూ.6 లక్షల విరాళాలను అందించారు. అలాగే ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలకై హనుమెలు రమేష్‌బాబు, డాక్టర్ కొత్త రామారావులు చెరో రూ.లక్ష చొప్పున రూ.2 లక్షలను అందించారు. ఈ సందర్భంగా దండా బ్రహ్మానందం మాట్లాడుతూ నూతన భవన సముదాయానికి భవిష్యత్తులో భారీ విరాళాన్ని ఇస్తున్నట్టు స్పష్టం చేశారు. సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లు మాట్లాడుతూ దాతలు అందిస్తున్న నైతిక, ఆర్థిక సహకారాలు మరువలేనివని, భవిష్యత్తులో కూడా దాతలు మరింతగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, పాలకవర్గ సభ్యులు వడ్లమూడి శివరామకృష్ణరామయ్య, పెద్ది సాంబశివరావు, గౌరవ సలహాదారు కన్నెగంటి బుచ్చయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.



పాలకవర్గ సభ్యులకు చెక్కును అందజేస్తున్న దండా బ్రహ్మానందం

రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణకు సత్కారం

గుంటూరు(తూర్పు), మార్చి 29: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై రామరాజు ఫౌండేషన్, యువకళావాహిని సంయుక్త ఆధ్వర్యంలో సారిపల్లి కొండలరావు సారధ్యంలో శుక్రవారం ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణకు సత్కార సభ జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు యువకళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. సభలో మాజీ స్పీకర్ డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, టీడీపీ నాయకులు మన్నవ సుబ్బారావు, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమి అధ్యక్షుడు దోగిపర్తి శంకరరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, జి.మల్లికార్జునరావు, డి. తిరుమలేశ్వరరావు పాల్గొని గుమ్మడి గోపాలకృష్ణను ఘనంగా సత్కరించారు. సభలో గుమ్మడి గోపాలకృష్ణ వివిధ పౌరాణిక నాటకాలలోని పద్యాలను రాగయుక్తంగా ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.



గుమ్మడి గోపాలకృష్ణను సత్కరిస్తున్న నిర్వాహకులు

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



ఉమేష్‌చంద్ర విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ రమేష్‌బాబు, పోలీసు అధికారులు తదితరులు

పోలీస్ వ్యవస్థకు వన్నెతెచ్చిన ఉమేష్‌చంద్ర

● డీఎస్పీ రమేష్‌బాబు

తెనాలి, మారీసుపేట మార్చి 29: పోలీస్ వ్యవస్థకు వన్నెతెచ్చిన ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్‌చంద్ర అని డీఎస్పీ రమేష్‌బాబు అన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకొని శుక్రవారం చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర కాంస్య విగ్రహానికి డీఎస్పీ రమేష్‌బాబు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రమేష్‌బాబు మాట్లాడుతూ ఉమేష్‌చంద్ర మృతిచెంది ఏళ్ళు గడచిన ఇప్పటికీ యువ పోలీసు అధికారులకు ఆదర్శప్రాయుడన్నారు. వృత్తి పట్ల నిబద్ధత కల్గిన అధికారని, ధైర్య సాహసాలకు మారుపేరులా నిలిచిన ఉమేష్‌చంద్ర పోలీసు సిబ్బందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ సీఐలు దశరధరామయ్య, ఎస్.వెంకట్రావు, ఎస్.రమేష్‌బాబు, కుటుంబ సభ్యులు జాస్తి భుజంగేశ్వరావు, దేవభక్తుని ఉమామహేశ్వరావు, తాడిబోయిన శ్రీనివాసరావు, కంతేటి శ్రీరాజబాబు, అయినంపూడి వెంకటేశ్వరావు, యడ్లపాటి వెంకటేశ్వరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాకీదారుల దాడి.. వ్యక్తి ఆత్మహత్య

కొల్లిపర, మార్చి 29: బాకీదారులు డబ్బులు అడటంతో పాటు, దౌర్జన్యం చేయడంతో మనస్థాపానికి గురై ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రం కొల్లిపరలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రం కొల్లిపరకు చెందిన అయోధ్య రామకృష్ణ (28) కొల్లిపరకు చెందిన లింగాల శివరామకృష్ణ, కొల్లిపర శేషుకు బాకీ ఉన్నాడు. రామకృష్ణను డబ్బులు అడగటంతో పాటు శివరామకృష్ణ, శేషు కలిసి కొట్టడంతో మనస్థాపానికి గురై గురువారం రాత్రి తాటి దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు తలుపుతీయగా రామకృష్ణ ఉరివేసుకుని కనిపించటంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రామకృష్ణ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి

తెనాలి రూరల్, మార్చి 29: ద్విచక్రవాహనాన్ని రాంగ్ రూట్‌లో అతి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన కరిముల్లా తన ద్విచక్రవాహనంపై షేక్ జాన్ వలి(51)తో కలిసి తెనాలి వస్తున్నాడు. ఈ క్రమంలో మంగళగిరి ప్రధాన రహదారిపై నందివెలుగు-కంచర్లపాలెం సమీపంలో ఎదురుగా అతివేగంగా వస్తున్న కారు రాంగ్ రూట్‌లో వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న కరిముల్లాకి తీవ్రగాయాలు కాగా వెనుక కూర్చున్న షేక్ జాన్‌వలి (51) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెనాలి రూరల్, మార్చి 29: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. అంగలకుదురు గ్రామానికి చెందిన పెండ్యాల వెంకటేశ్వరరావు (27) గురువారం రాత్రి ఆర్టీసీ బస్సులో గ్రామంలోని సాయిబాబా గుడి వద్ద దిగాడు. రోడ్డు దాటుతుండగా నారాకోడూరు వైపు నుంచి తెనాలి వస్తున్న ఆటో అతడిని ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడిని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు పేర్కొన్నారు.

వృద్ధాశ్రమంలో ఆహారం పంపిణీ



వృద్ధులకు ఆహారం పంపిణీ చేస్తున్న యోగా సభ్యులు

తెనాలి, మారీసుపేట మార్చి 29: స్థానిక గాంధీనగర్‌లోని షిర్డిసాయి వృద్ధాశ్రమంలో శుక్రవారం శ్రీవెంకటేశ్వర యోగా సేవ కేంద్రం వారి ఆధ్వర్యంలో యోగా సభ్యులు చదలవాడ వేణుగోపాలరావు, నయనతారల కుమారుడు ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్ చంద్ర 58వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆశ్రమంలోని వృద్ధులకు ఆహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ యోగా కన్వీనర్ రమణయ్య, ఆశ్రమ నిర్వాహకులు, యోగా సభ్యులు పాల్గొన్నారు.


దాతల సాయం స్ఫూర్తిదాయకం

● కేజేఎస్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు సామినేని, చుక్కపల్లి రమేష్

● నూతన భవన సముదాయానికి వరుస విరాళాలు

గుంటూరు (తూర్పు), మార్చి 29: వసతి గృహానికి, నూతన భవన సముదాయానికి పేద విద్యార్థులకు ఆర్థిక తోడ్పటును అందిస్తున్న దాతల సాయం స్ఫూర్తిదాయకమని కమ్మజన సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్ కొనియాడారు. స్థానిక జేకేసీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయానికి దాతలు శుక్రవారం వరుస విరాళాల ను అందించారు. అందులో భాగంగా జ్యోతిర్మయి టెక్స్‌టైల్స్ ప్రైవేటు లిమిటెట్ చైర్మన్ దండా బ్రహ్మానందం రూ.6,55,000/-, ఎల్ఎం ఆటో టెక్ ప్రైవేటు లిమి టెడ్ అధినేత పాములపాటి రవీంద్రబాబు రూ.6 లక్షలు, మరో దాత మైనేని సీతారామయ్య కుమారుడు మైనేని కోటేశ్వరరావు రూ.6 లక్షల విరాళాలను అందించారు. అలాగే ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలకై హనుమెలు రమేష్‌బాబు, డాక్టర్ కొత్త రామారావులు చెరో రూ.లక్ష చొప్పున రూ.2 లక్షలను అందించారు. ఈ సందర్భంగా దండా బ్రహ్మానందం మాట్లాడుతూ నూతన భవన సముదాయానికి భవిష్యత్తులో భారీ విరాళాన్ని ఇస్తున్నట్టు స్పష్టం చేశారు. సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లు మాట్లాడుతూ దాతలు అందిస్తున్న నైతిక, ఆర్థిక సహకారాలు మరువలేనివని, భవిష్యత్తులో కూడా దాతలు మరింతగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, పాలకవర్గ సభ్యులు వడ్లమూడి శివరామకృష్ణరామయ్య, పెద్ది సాంబశివరావు, గౌరవ సలహాదారు కన్నెగంటి బుచ్చయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

వటపత్రశాయిగా లక్ష్మీనృసింహుడు



వటపత్రశాయి అవతారంలో మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారు

మంగళగిరి, మార్చి 29: మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా రెండవ రోజైన శుక్రవారం శ్రీవారు వటపత్ర శాయిగా భక్తులకు దర్శనమిచ్చారు. దిగువ సన్నిధిలోని శ్రీకృష్ణదేవరాయ ముఖమండపంలో రాత్రి 8 గంటల నుంచి శ్రీవారు వటపత్రశాయి రూపం లో భక్తులను అలరించారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈఉత్సవానికి హైదరాబాద్‌కు చెందిన మేళ్లచెరువు సీతా మహా లక్ష్మీ కైంకర్యపరులుగా వ్యవహరించారు. దేవస్థానం కార్య నిర్వహణా ధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు హుండీల లెక్కింపు.. మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీలను శనివారం ఉదయం 9 గంటల నుంచి లెక్కించ నున్నట్టు దేవాదాయశాఖ సహాయ కమిషనరు, ఈవో రామకోటిరెడ్డి తెలిపారు. ఎగువ, దిగువ సన్నిధులతో పాటు ఘాట్‌రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లోని హుండీలను లెక్కించనున్నారు. ఆసక్తికలిగిన భక్తులు, భక్తబృందం ప్రతినిధులు లెక్కింపులో పాల్గొనవచ్చని తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



యేసు శిలువ మోస్తూ కొరడాలతో దెబ్బలు తినే సన్నివేశం ప్రదర్శన



జూపూడిలో శిలువ ధారణ నాటకం ప్రదర్శిస్తున్న క్రైస్తవ భక్తులు

తెనాలి అర్బన్, మార్చి 29: పట్టణంలో క్రైస్తవులు శుభ శుక్రవారం ప్రార్థనలు జరుపుకున్నారు. వేకువజామున పలుచోట్ల క్రీస్తు గీతాలతో ఊరేగింపు చేశారు. పలు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఐతానగర్‌లో శిలువ వేషధారణతో యేసు పాత్రధారి కొరడా దెబ్బలు తింటున్న సన్నివేశాలు ప్రదర్శించారు. పట్టణంలోని బోసురోడ్డులోని ప్రధాన టౌన్ చర్చిలో పాస్టర్ దేవరపల్లి యేసురత్నం, లెనిన్‌బాబు, సాల్మన్‌రాజు, ప్రకాష్‌బాబు ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. వాక్యపఠనం, సందేశం, ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించారు. చెంచుపేట చర్చిలో ఫాదర్ స్లీవా, విజయ్‌కుమార్, విన్సెంట్‌లు ప్రార్థనలు నిర్వహించారు. నందివెలుగులోని ఇమ్మానియేలు ప్రార్థనా గోపురంలో రెవరెండ్ భాను ప్రసాద్ యేసు క్రీస్తు శిలువలో పలికిన మాటలు వినిపించారు. మారీసుపేట, గంగానమ్మపేటలలో ప్రత్యేక కార్యక్రమాలలో భక్తులు పాల్గొన్నారు. ఐతానగర్ సాల్వేషన్ ఆర్మీ చర్చిలో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. మేజర్ నాగరాజు, రత్నసుందరి క్రీస్తు సిలువ సందేశం ఇచ్చారు. సంఘ పెద్దలు జక్రయ్య, రవికుమార్ పాల్గొన్నారు. ఇస్లాంపేట యేసయ్య ప్రార్థన కొండ చర్చిలో బ్రదర్ ఆనందన్న సిలువలో పలికిన ఏడు మాటలను బైబిల్ పఠనం చేయించారు.

● పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 29: సర్వ మానవాళి పాప విముక్తి కోసం ఏసు క్రీస్తు శిలువధారణ పొందిన రోజుగా శుక్రవారం గుడ్ ఫ్రైడేను పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో భక్తి శ్రద్ధతో నిర్వహించారు. పట్టణంలోని పాతపొన్నూరు క్రీస్తు సత వార్షిక లూథరన్ దేవాలయం, నిడుబ్రోలు లూథరన్ దేవాలయం, జీబీసీ రోడ్డులోని క్రీస్తు ఉథాన్ దేవాలయం, సాల్వేషన్ ఆర్మీ చర్చి తదితర ప్రార్థన మందిరాలలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. జూపూడి గ్రామంలో ఆర్‌పీఎం చర్చి ఆధ్వర్యంలో శిలువ ధారణ నాటకాన్ని గ్రామవీధులో ప్రదర్శించారు.

● కొల్లిపర: మండలంలోని వల్లభాపురం, పిడపర్రు, పిడపర్తిపాలెం, తూములూరు, దావులూరు, అన్నవరం, అన్నవరంలంక, దావులూరిపాలెం, చెముడుబాడు, చివలూరు, సిరిపురం, దంతలూరు, కుంచవరం తదితర గ్రామాల్లో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో శుక్రవారం పండుగను జరుపుకున్నారు. ఉపవాసాలతో ప్రార్థనలు నిర్వహించారు. కొల్లిపర చర్చిల్లో పాస్టర్లు దేవానంద్, డేవిడ్‌రాజులు భక్తులకు క్రీస్తు సందేశాన్ని అందించారు. కొల్లిపర మండలం అత్తోట చర్చిలో జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ సతీమణి డాక్టర్ మనోహరం గుడ్‌ఫ్రైడ్ వేడుకల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు.



కొల్లిపర చర్చిలో దైవ సందేశాన్ని ఇస్తున్న పాస్టర్ డేవిడ్‌రాజు



కొల్లిపర మండలం అత్తోటలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలో పాల్గొన్న డాక్టర్ మనోహరం





ప్రార్థనలో పాల్గొన్న భక్తులు, టౌన్ చర్చిలో బోధన చేస్తున్న పాస్టర్లు



ఐతానగర్ చర్చిలో ఆశీర్వచనం చేస్తున్న పాస్టర్లు

ఎస్టీల సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ: ధూళిపాళ్ళ

● పొన్నూరులో ఎస్టీ కాలనీలో, చేబ్రోలులో ప్రచారం

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 29: ఎస్టీల సంక్షేమానికి వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని 19వ వార్డు ఎస్టీ కాలనీలో నరేంద్రకుమార్, టీడీపీ, జనసేన నాయకుడు ఇంటింటి పర్యటన నిర్వహించి బాబు ష్యూరిటీ, భవిష్యతుకు గ్యారంటీ కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎస్టీ కాలనీ వాసులు తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి నరేంద్రకుమార్‌కు వివరించారు. టీడీపీ ప్రభుత్వంలో పేదలు, సొంత స్థలాలో పక్కా గృహాలు నిర్మించుకునేందుకు ప్రభుత్వం గృహ నిర్మాణ పథకాన్ని అమలుచేసి నిధులు ఇచ్చిందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో గృహ నిర్మాణానికి నిధులు ఇవ్వకపోవటం వల్ల సొంత స్థలం ఉన్న పేదలు పక్కా గృహాలు నిర్మించుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఇటీవల పక్కా గృహాలు లేకపోవటం వల్ల 9 కుటుంబాలు అగ్ని ప్రమాదానికి గురై రోడ్డునపడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నరేంద్రకుమార్ మాట్లాడుతూ పేదలకు మౌలిక వసతులు కల్పించలేని వైసీపీ పాలకులు అసత్యాలను మాత్రం ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. కార్పొరేషన్ల పేరుతో నిధులు లేని పదవులు ఇచ్చి రాజకీయ పబ్బం కడుపుకుంటున్నారని ఎద్దేవాచేశారు. ఎస్టీలకు ప్రత్యేకంగా ఏంచేసారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎస్టీ నాయకులు తట్ట బులయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే చేబ్రోలు గ్రామంలోని ఇందిరా కాలనీ, చెన్నారెడ్డి కాలనీ, కొత్త మాదిగపల్లి, బీసీ కాలనీలో కొండయ్య బజార్, యాదవ సమాజం ఏరియా, ముస్లీం ఏరియాలో పాదయాత్ర నిర్వహించి నరేంద్రకుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాలో టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్టీ కాలనీ సమస్యలు ఆలకిస్తున్న నరేంద్ర కుమార్

పేదల స్వేదం నుంచి పుట్టిన పార్టీ టీడీపీ: ధూళిపాళ్ళ



టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కేక్‌ను కట్ చేస్తున్న నరేంద్ర కుమార్ తదితరులు

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), మార్చి 29: పేదవాడి స్వేదం, కార్మిక, కర్షకుల కష్టం నుంచి పుట్టిన పార్టీ తెలుగుదేశం అని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఎగురవేసి ఎన్టీఆర్, వీరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేక్‌ను కోసి అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆకాంక్షలకు ఆత్మగౌరవానికి వేదిక టీడీపీ అన్నారు. తరాలతరబడి అధికారాలకు దూరంగా ఉన్న అణగారిన వర్గాలకు టీడీపీ బాసటగా నిలిచిందన్నారు. బడుగు బలహీనవర్గాలు ఆత్మవిశ్వాసంతో ముందుకు కదిలేలా ప్రోత్సహించిందన్నారు. టీడీపీ తీసుకున్న ఎన్నో నిర్ణయాలు పాలకులు మారినా అమలుచేయక తప్పని పరిస్థితులు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. పట్టా గృహాల నిర్మాణం, ఉచిత బియ్యం, ఉచిత విద్యుత్తు, పంట రాయితీలు వంటి నిర్ణయాలు నేటి పాలకులు టీడీపీ స్ఫూర్తితోనే కొనసాగిస్తున్నట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఎంతోమంది జీవితాలను ప్రభావితం చేసిందన్నారు. అటువంటి చరిత్ర కలిగిన టీడీపీ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు. వైసీపీ ఐదేళ్లపాలన అవినీతిమయం అన్నారు. ఎమ్మెల్యే రోశయ్యచేసిన దోపిడీపై ఇటీవలే ప్రజా చార్జిషీట్‌ను విడుదల చేసిన్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికలో వైసీపీ భూస్థాపితమైపోతుందని నరేంద్ర కుమార్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు జనసేన నాయకుడు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే చేబ్రోలు పార్టీ కార్యాలయంలో టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. మైలా వెంకటరామరాజు పార్టీ పతాకాన్ని ఎగురవేసి మిఠాయిలు పంచిపెట్టారు.

● పెదకాకాని, మార్చి 29: తెలుగుదేశం పార్టీ 42 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పెదకాకాని మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిష్కరణ దినోత్సవం ఘనంగా నిర్వహించిన్నారు. తొలిత పార్టీ జెండాను ఆవిష్కరణ చేసిన అనంతరం ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలు మాలలు వేసి , కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండలం గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, పార్టీ శ్రేణులు

పేదల కోసం ఉద్భవించిన పార్టీ తెలుగుదేశం

● తెనాలి పట్టణ పార్టీఅధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్

తెనాలి రూరల్, మార్చి 29: ఆనాడు పేదవాడి ఆకలిబాధలు చూడలేని దివంగత ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని ఆ ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ చెప్పారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కొత్తపేట పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పతాకాన్ని పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. తొలుత దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో జొన్నాదుల మహేష్, కనక రాంబాబు, మాదల కోటేశ్వరరావు, ఈదర వెంకటపూర్ణచంద్, కంచర్ల ఏడుకొండలు, పాలడుగు ప్రణీత్, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, కోగంటి వెంకటేశ్వరరావు, అశోక వసంతం, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, శాఖమూరి చలపతిరావు, ముల్లపూడి వెంకట్, వేణు, ఇర్ఫాన్, రఘు, కామేశ్వరి, పణితపు దుర్గ, జయరాం, గిరిగణేష్, ఎన్టీఆర్ జగన్, చల్లగాలి శివరాజు, మల్లవరపు విజయ్‌కుమార్, శ్యామ్, నన్నపనేని లింగారావు, పలువురు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ముగ్గురు పోలీస్ అధికారులకు ఉగాది పురస్కారాలు

గుంటూరు, మార్చి 29 : జిల్లాలో పని చేస్తున్న ముగ్గురు పోలీస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాలు ప్రకటించింది. జిల్లా క్రైమ్స్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతురాజు, సౌత్ డీఎస్పీ మహబూబ్ బాషాలకు ఉగాది పురస్కారాలు లభించాయి. అలాగే అదనంగా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ పోతురాజుకు డీజీపీ బ్రాంజ్ డిస్క్ లభించింది. విధి నిర్వహణలో సమర్థవంతంగా పని చేసిన అధికారులను గుర్తించి ఈ అవార్డులకు ఎంపిక చేసినట్టు పోలీస్ అధికారులు తెలిపారు.

అధికారపార్టీ రంగులకు కోడ్ వర్తించదా...!



21వ వార్డులో శివాలయం దగ్గర వైసీపీ రంగులతో ఉన్న సీసీ రోడ్డు శిలాఫలకం

తెనాలి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వ సమయంలో వేసిన శిలాఫలకాలపై పేర్లు కూడా కనిపించకుండా కాగితాలు అంటించిన అధికారులు రధీ సెంటర్‌లో రోడ్డువెంటే అధికార పార్టీ వైసీపీ మూడు రంగులతో ఉన్న శిలాఫలకాన్ని మాత్రం మునిసిపల్ అధికారులు వదిలేశారు. తెనాలి పట్టణం మారీసుపేటలోని శివాలయం దగ్గరలో ఓ సీసీ రోడ్డు నిర్మాణం కోసం వేసి ఉంచిన శిలాఫలకం రంగులు లేకుండా కేవలం పేర్లతో ఉంటే వదిలేశారన్న పర్వాలేదే మోగాని మూడు రంగులతో కనిపిస్తున్నా మునిసిపల్ అధికారులు కళ్లు మాత్రం దీనిపై పడలేదు. మూడు రంగులతో పాటు ఫలకంపై ఎమ్మెల్యే, గత చైర్‌పర్సన్‌ల ఫోటోలు దీనిపై దర్శనమిస్తున్నాయి. ఎన్నికల నిబంధనలకు ఇది పూర్తి విరుద్ధంగా కనిపిస్తున్నా అధికారులు మాత్రం అధికార పార్టీకి దాసోహం అన్నట్లు వదిలేయడం పలు విమర్శలకు తావిస్తుంది.



మినీ కల్యాణ మండపంలో నిల్వ ఉంచిన వైసీపీకి చెందిన ప్రచార సామగ్రి, నిత్యావసర నిల్వలు పరిశీలిస్తున్న అధికారులు

అనుమతి లేని వైసీపీ ప్రచార సామగ్రి సీజ్

పొన్నూరు టౌన్, మార్చి 29: మండల పరిధిలోని కట్టెంపూడి గ్రామంలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన వైసీపీ ప్రచార సామగ్రి, రెండు వాహనాలు సీజ్ చేసిన్నట్లు రిటర్నింగ్ ఆఫీసర్ ఏ లక్ష్మీకుమారి తెలిపారు. శుక్రవారం సీ విజల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు బూత్ ఆఫీసర్ జి.వరదరాజులు నేతృత్వంలోని బృందం నాగేంద్ర స్వామి పుట్ట ఎదురుగా ఉన్న మినీ కల్యాణ మండపంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాలో పెద్దఎత్తున నిల్వ ఉంచిన వైసీపీ ఎన్నికల సామగ్రితో పాటు బియ్యం, వంట నూనె డబ్బాలు, నిత్యావసరాలు, ఆహార పదార్థాలను అధికారులు గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎన్నికల సామగ్రిని స్వాధీనం చేసుకోవటానికి అధికారులు ప్రయత్నించగా కొందరు వైసీపీ నాయకులు అక్కడి చేరుకొని అధికారులతో వాగ్వివాదానికి దిగారు. రూరల్ ఎస్ఐ బి భార్గవ్ ఈ సమాచారం అందుకొని సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్క దిద్దారు. అధికారుల విధులను ఆటంకం పరిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రిటర్నింగ్ ఆఫీసర్ ఆదేశాలతో ఎన్నికల సామగ్రిని రెండు అనుమతిలేని ప్రచార వాహనాలను సీజ్ చేశారు.

మద్యం కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

పొన్నూరు టౌన్, మార్చి 29: అనుమతి లేకుండా మద్యం కలిగివున్న వ్యక్తిని అరెస్టు చేసిన్నట్లు అర్బన్ ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పట్టణంలోని ఐల్యాండ్ సెంటర్ కార్లస్టాండ్ వద్ద సంచరిస్తున్న బాపట్ల జిల్లాకు చెందిన కెసారపు కోటేశ్వరరావును అదుపులోకి తీసుకొని విచారించగా ఐదు మద్యం బాటిళ్లు గుర్తించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

అర్చకులపై దాడులకు ఖండన

పొన్నూరు టౌన్, మార్చి 29: నిత్యం దైవారాధనలో ఉండే అర్చకులపై రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న దాడులు, వేధింపులు గర్హనీయం అన్ని బ్రాహ్మణమహాసభ నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కాకినాడ శివాలయం అర్చకులపై దాడి, శుక్రవారం బిక్కవోలు వినాయకస్వామి ఆలయంలో అర్చకులపై ఈవో వేధింపు చర్యలను తీవ్రంగా ఖండించారు. అర్చకులపై దాడులు కొనసాగితే నాశనం తప్పదని హెచ్చరించారు. దాడులపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణసభ నాయకులు పులిపాక ప్రసాద్, గణపవరపు రామశాస్త్రి, ఆముదాలపల్లి రామకృష్ణ, దేశరాజు తిలక్, శ్రీనివాసరావు, రాజకృష్ణమాచార్యులు తదితరులు ప్రభుత్వాన్ని కోరారు.



వాసుదేవానంద సరస్వతీ స్వామికి జ్ఞాపికను అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

గోశాలను సందర్శించిన

వాసుదేవానంద సరస్వతి

● ఆశీస్సులు తీసుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

మంగళగిరి, మార్చి 29: అయోధ్య రామాలయట్రస్టు సభ్యుడు స్వామి వాసుదేవానంద సరస్వతీ మహరాజ్ శుక్రవారం మంగళగిరి విచ్చేశారు. శ్రీవారి దర్శనం కోసం తిరుమల వెళుతూ మార్గం మధ్యలో గురువారం రాత్రి ఉండవల్లి కరకట్ట రోడ్డులోని అతిథి గృహంలో బసచేశారు. తిరిగి శుక్రవారం ఉదయం విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని, అనంతరం మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో పాతూరి నాగభూషణం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలను సందర్శించారు. గోవులకు ఆహారం అందించారు. స్వామీజీ రాక గురించి తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి గోశాలకు విచ్చేసి వాసుదేవానంద సరస్వతీస్వామి ఆశీస్సులు అందుకున్నారు. అయోధ్య బాలరాముడి చిత్రంతో కూడిన జ్ఞాపికను స్వామీజీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో రామినేని ఫౌండేషన్ చైర్మన్ ధర్మ ప్రచారక్, గోలగాని చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రవికృష్ణ, వేణు, శ్రీనివాసరావు, పలువురు భక్తులు పాల్గొని స్వామీజీ ఆశీస్సులు పొందారు.

రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణకు సత్కారం



గుమ్మడి గోపాలకృష్ణను సత్కరిస్తున్న నిర్వాహకులు

గుంటూరు(తూర్పు), మార్చి 29: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వ రస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై రామరాజు ఫౌండేషన్, యువ కళావాహిని సంయుక్త ఆధ్వర్యంలో సారిపల్లి కొండలరావు సారథ్యంలో శుక్ర వారం ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణకు సత్కార సభ జరి గింది. ఈ సందర్భంగా జరిగిన సభకు యువకళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. సభలో మాజీ స్పీకర్ డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, టీడీపీ నాయకులు మన్నవ సుబ్బారావు, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమి అధ్యక్షుడు దోగిపర్తి శంకరరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తాన య్య రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, జి.మల్లికార్జునరావు, డి. తిరుమలేశ్వరరావు పాల్గొని గుమ్మడి గోపాలకృష్ణను ఘనంగా సత్కరించారు. సభలో గుమ్మడి గోపాలకృష్ణ వివిధ పౌరాణిక నాట కాలలోని పద్యాలను రాగయుక్తంగా ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.